Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 09.06.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 01 పేజీలు : 12, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## 36 అక్షర సేవలో ముప్పైఆరేళ్ళు

అవును అక్షరాలా ముప్పైఆరేళ్ళు. కీ॥శే॥ తుంగా రాజగోపాలరెడ్డి గారి ఆశల దీపం, ఆశయాల రూపంగా 1981 జూన్‌5వ తేదీ పురుడుపోసుకున్న లాయర్ వారపత్రిక అక్షర సేద్యం మొదలుపెట్టి 36 సంవత్సరాలు పూర్తి చేసుకుంది. నిరంతరాయంగా పత్రికను నడపడానికి నిరంతరం శ్రమిస్తూ, పత్రికా రంగంలో వస్తున్న వినూత్న మార్పులను, కొత్త కొత్తగా అవలంబిస్తున్న వింతైన పోకడలను తట్టుకుని ఎదురొడ్డి నిలబడి తన ప్రస్థానాన్ని మచ్చలేని చంద్రుడిలా కొనసాగిస్తూ 37వ పడిలో అడుగుపెట్టింది మా(మీ) లాయర్ పత్రిక.

సందు సందుకీ గొందిగొందికీ ఓ పత్రిక ఓ న్యూస్ ఛానల్ పుట్టుకొస్తున్న ఈ రోజుల్లో ఎక్కడా తన పట్టు కోల్పోకుండా వ్యవస్థాపకుడి ఆశయ సాధనకు అంతరాయం కలుగకుండా ఆయన ఆలోచనా విధానానికి ఆటంకం రానీయకుండా తనదైన శైలిలో తనదంటూ ఓ ఒరవడిగా తన బాటే ఓ అలజడిగా ఆయనకిచ్చిన మాటే కట్టుబడిగా ముందుకు సాగుతోంది మా(మీ) లాయర్.

రెప్పపాటు కాలంలో తాజా సమాచారాన్ని ప్రపంచమంతా విస్తరింపజేస్తున్న "సోషల్ మీడియా" విచ్చలవిడిగా వార్తా సామ్రాజ్యంలో సవారీ చేస్తున్న తరుణంలో ఎక్కడో ఓ మారుమూల జిల్లా కేంద్రం నుండి తన వాణిని వినిపిస్తూ ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన లక్షలాదిమంది నెల్లూరీయులను క్రమం తప్పకుండా వారంవారం పలుకరిస్తూ నేనున్నానంటూ వారందరికీ చేరువైన నెల్లూరీయుల ప్రియపుత్రిక లాయర్.

ఇది ముమ్మాటికీ నెల్లూరీయుల విజయమే. గత 36 సంవత్సరాలుగా అభిమానించి, ఆదరించి అక్కున చేర్చుకున్న ప్రతి నెల్లూరీయుడి విజయమే. "చిన్నారుల విజయదీపిక" అంటూ 12 సంవత్సరాలలోపు చిన్నారుల విజయ గాధలను ఆవిష్కరించినా, "ఇదీ సాంబమూర్తి గారి కథ' అంటూ శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తి గారి జీవిత విశేషాల సంకలనాన్ని పాఠక లోకానికి అందించినా, "శతమానం భవతి" అంటూ "పెళ్లి పుస్తకాన్ని" అలంకరించి అచ్చువేసి రేపటి తరానికి అందించినా అన్నింటా మీ వెంట మేమున్నాం అంటూ చేయూతనిచ్చి ప్రోత్సహించిన లాయర్ ఆత్మబంధువులెందరో వున్నారు. వారందరికీ పేరుపేరునా ఈ శుభతరుణాన కృతజ్ఞతాపూర్వక నమస్సుమాంజలులు.

మీ ఆదరణే మాకు కొండంత అండ, మీ ఆత్మీయ ఆశీస్సులే మా శ్వాస నిశ్వాసలు. అనుక్షణం మీరిచ్చే ప్రోత్సాహమే మాకు ఉత్సాహం. అనునిత్యం మీరిచ్చే చేయూతే మాకు ఊతం... అందుకే అంటున్నాం ఈ విజయం మాది కాదు మీదే. "లాయర్" ఎక్కే ప్రతి మెట్టూ లాయర్ పై మీరు పెంచుకున్న నమ్మకానికి తొలిమెట్టు. ఇదే ధైర్యంతో, ఇంతే విశ్వాసంతో, అంతే ఆత్మస్థైర్యంతో మీ సేవలో ముందడుగేస్తామని, మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిర్విఘ్న అక్షర యజ్ఞాన్ని కొనసాగిస్తామని ప్రతినబూనుతూ...
మీ సేవలో పునరంకిత మౌతున్నాం...

తుంగా శివప్రభాత్‌రెడ్డి
సం/-



# నవనిర్మాణ శిక్ష

- వారంరోజుల దండగమారి జాతర
- ఉద్యోగులు, అధికారుల్లో అసంతృప్తి
- జన్నాన్ని తేలేక నాయకుల్లో అసహనం

పోరాడి సాధించుకున్న తెలంగాణలో మాత్రం ఆ రాష్ట్ర అవతరణ వేడుకలను ఒక్కరోజులో ముగిస్తున్నారు. సంబరాలు ఆరోజే జరుపుకుంటున్నారు. మిగతా రోజులు యధావిధిగా పనుల్లో పడుతున్నారు. రాష్ట్రం సాధించుకున్నందుకు వాళ్ళు ఒక్కరోజు పండుగ చేసుకుంటుంటే, రాష్ట్ర విభజన రూపంలో దారుణాతి దారుణంగా నష్టపోయిన మనం మాత్రం ప్రతి సంవత్సరం రాష్ట్ర విభజన జరిగిన జూన్ 2వ తేదీ నుండి వారం రోజుల పాటు నవ నిర్మాణ దీక్షల పేరుతో సంతాపసభలను నిర్వహించుకుంటున్నట్లుగా వుంది. మానిన గాయాలను మళ్ళీ పుండ్లుగా రేపుకుంటున్నట్లుంది.

నవనిర్మాణదీక్షల పేరుతో ఈ సంతాప సభలేంటి? రాష్ట్ర విభజనతో నష్టం జరిగిపోయిందని ఎన్ని సంవత్సరాలు ఏడుద్దాం. అసలు అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగంతో ఆంధ్రప్రదేశ్ అవతరించిన

(మిగతా 11వ పేజీలో)

## ప్రగతి యోధునికి సన్మానం




3లో



## అంబరాన్నంటిన అద్భుతం

11లో

జిఎస్ఎల్‌వి మార్క్-3డి1 విజయకేతనం
అంతరిక్ష ప్రయోగాలలో ఇస్రో సరికొత్త చరిత్ర

## సుమధుర స్వరానికి సత్కారం



12లో

36
సంచలనాల వేదిక... సంకలనాల వీచిక...
లాయర్
వారపత్రికకు 36వ వార్షికోత్సవ శుభాకాంక్షలు.
SMD HOMES
Value beyond Bricks
BANGALORE

# ఇఫ్కో అక్రమ భూములను స్వాధీనం చేసుకోవాలి

ఇఫ్కో కిసాన్‌సెజ్ అక్రమంగా తన ఆధీనంలో ఉంచుకున్న 596 ఎకరాల భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నాయకులు రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని కోరారు. వివాదాలేమీలేని ఈ భూమిని స్వాధీనం చేసుకోవడంలో జిల్లా కలెక్టర్ సాగదీత ధోరణితో వ్యవహరిస్తున్నారని వారు ఫిర్యాదు చేశారు. రాచర్లపాడు చెరువును ఇఫ్కో చెర నుంచి విడిపించి రైతులకు అప్పగించాలని వారు కోరారు. కిసాన్‌సెజ్ కోసం 1986లో 2,778.23 ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్, దేవాదాయశాఖ భూములను కావలి ఆర్డీవో ఇఫ్కోకు అప్పగించారని వారు చెప్పారు. ఇవికాకుండా వివిధ సర్వేనెంబర్లకు సంబంధించిన 596ఎకరాల భూమిని ఇఫ్కో ఛైర్మెన్, ఇఫ్కో పేర్లతో వారి ఆధీనంలో ఉంచుకున్నారని ఫిర్యాదు చేశారు. వారికి ఈ భూములు ఏ రకంగా వచ్చాయనే వివరాలు కూడా రెవెన్యూ రికార్డుల్లో లేవని, రూ.500కోట్లకు పైగా విలువచేసే ఈ భూమిని స్వాధీనం చేసుకోవాలని జిల్లా అధికారులను అనేకసార్లు కోరినా ఫలితం లేదన్నారు. కిసాన్‌సెజ్ భూములపై హైకోర్టు స్టే ఉన్నా, గమేసా కంపెనీ సెజ్ నిబంధనలకు విరుద్ధంగా ఎనిమిది కాలుష్య కారక రసాయనాలను ఉత్పత్తి చేస్తోందని చెప్పారు. జిల్లా యంత్రాంగం ఆ ఫ్యాక్టరీని తనిఖీ చేసి ఫ్యాక్టరీని మూయించి వేసేలా ఆదేశాలివ్వాలని మంత్రిని కోరారు. ఈ పరిశ్రమ రెండో యూనిట్‌కు రాచర్లపాడు పంచాయతీ అనుమతి నిరాకరించిందన్నారు. అయితే కలెక్టర్ కంపెనీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. రాచర్లపాడు చెరువులో ఉపాధి హామీ పథకం కింద అభివృద్ధి పనులు చేస్తుంటే ఇఫ్కో అధికారులు అడ్డుకుని క్రిమినల్ కేసులు పెట్టారని తెలిపారు. జడ్పీటీసీ శ్రీధర్‌రెడ్డి, ఊచగుంటపాలెం సర్పంచ్ శ్రీనివాసులు, రైతు సంఘం నాయకులు బెజవాడ గోవిందరెడ్డి, అక్కుల్‌రెడ్డి, ప్రభాకర్‌నాయుడు మంత్రిని కలిసిన వారిలో వున్నారు. ఈ ఫిర్యాదు మీద కలెక్టర్‌తో చర్చించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

సింహపురి సమాచారం

# జర్నలిజం.. సమాజానికి మార్గదర్శకం

జర్నలిజం సమాజానికి మార్గదర్శకమని, సమాజాన్ని చైతన్యపరచి ముందుకు నడిపించి మార్గదర్శనం చేసేది జర్నలిజమేనని ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఏపియుడబ్ల్యుజె అనుబంధ విభాగమైన యూనియన్ ఆఫ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు టౌన్‌హాల్ ప్రాంగణంలోని రేబాల లక్ష్మీనరసారెడ్డి స్మారక భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత సమాజానికి జర్నలిజమే ఆశాకిరణమన్నారు. ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్ మాట్లాడుతూ, సమాజానికి జర్నలిస్టులు, కవులు ఎంతో ఉత్తమసేవలు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ పాత్రికేయుడు ఈతకోట సుబ్బారావు, 'లాయర్' వారపత్రిక ఉపసంపాదకుడు మద్దూరు శ్రీనివాసులును



ముఖ్యఅతిథుల నుంచి సన్మానం అందుకున్న పాత్రికేయులు ఈతకోట సుబ్బారావు, మద్దూరు శ్రీనివాసులు

ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు. తొలుత కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులను వక్తలందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ఆఫ్ ఎడిటర్స్ అండ్ జర్నలిస్ట్స్ అధ్యక్షుడు సర్వేపల్లి రామమూర్తి, పద్య కళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్ర ప్రసాద్, నిర్వాహకులు హనోక్, విజయ్ కుమార్ తదితరులు, పలువురు కవులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# కొత్త వారికి జనసేనలో చోటు



సత్తా వున్న కొత్తవారికి జనసేనలో చోటు కల్పించడానికి సభ్యత్వ ఎంపికలను నిర్వహిస్తున్నట్లు జనసేన పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం సమీపంలోని కిలారి తిరుపతినాయుడు కళ్యాణ మండపంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ ఎంపిక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా రెండు వేల మంది దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. వీరిని ఎనిమిది బ్యాచ్‌లుగా విభజించి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోని వారు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. జనసేన మీడియా ఇన్‌ఛార్జి హరిప్రసాద్, రాష్ట్ర నాయకులు రియాజ్, నరశింహారావు, పసుపులేటి వరప్రసాద్, జిల్లా పవన్‌కళ్యాణ్ అభిమాన సంఘ నాయకులు టోనీ, హరి పాల్గొన్నారు.



గూడూరు డిఎన్ఆర్ కమ్యూనిటి హాలులో బుధవారం జరిగిన నవనిర్మాణ దీక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ, పక్కన ఎమ్మెల్యే పి.సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, డిఎస్పీ బి.శ్రీనివాస్ తదితరులు

# విజిలెన్స్ దాడులు

నెల్లూరుజిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ శ్రీకంఠనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం సిఐలు శ్రీనివాసరావు, నారాయణరావు, ఆంజనేయరెడ్డి వారి సిబ్బంది కలిసి పొదలకూరులోని రేషన్ షాపులపై దాడులు నిర్వహించారు. 53వ షాపు మూసివేయడంతో రెవెన్యూ అధికారుల సమక్షంలో షాపుకు విజిలెన్స్ అధికారులు సీలు వేశారు. సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ పట్టణంలోని 50, 51, 52, 45, 54 షాపులను తనిఖీ చేసామన్నారు. రేషన్‌షాపులపై దాడులు నిర్వహించడం వల్ల డీలర్లు సరుకులను సక్రమంగా పంపిణీ చేస్తున్నారా లేదా అన్న విషయం తెలుస్తుందన్నారు. దాడుల్లో ఏఓ ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

# ఏం పొడిచారని దీక్షలు

- కాకాణి




మూడేళ్ల పాలనలో ప్రజలకు ఏం ఒరగబెట్టారని నవనిర్మాణ దీక్షలు చేస్తున్నారని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఎద్దేవా చేశారు. 6వ తేదీ నెల్లూరులోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ మూడేళ్లలో ప్రాజెక్టులు లేవు, పరిశ్రమలు లేవు, పంటలకు గిట్టుబాటు ధరలు లేవు, పైర్లకు నీళ్ళు లేవు, ఋణాల మాఫీ లేదు, ఋణాల రీషెడ్యూల్ లేదు, ఉద్యోగాలు లేవు, ఉపాధి మార్గాలు లేవు, వృద్ధులు, వికలాంగులు, చేనేత కార్మికులకు పింఛన్‌లు లేవు, ఎస్సీ ఎస్టీలకు ఋణాలు లేవు, భూముల పంపిణీ లేదు, నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగ భృతి లేదు, రేషన్‌లో ఇచ్చే చక్కెర, కిరోసిన్‌కు కోత పెట్టారు, రాష్ట్రాన్ని అవినీతి మయం చేశారు. దోపిడీ రాజ్యంగా చేసారు. ఇందుకేనా నవనిర్మాణదీక్షలు అని కాకాణి ప్రశ్నించారు. నవనిర్మాణ దీక్ష ప్రభుత్వ కార్యక్రమంలా కాకుండా తెలుగుదేశంపార్టీ కార్యక్రమంగా మారిందని విమర్శించారు. దేవుడు శాసిస్తే పోలవరం ప్రాజెక్ట్ కడుతున్నానని చంద్రబాబు డబ్బా కొట్టుకోవడం వికారంగా వుందని, పోలవరం ప్రాజెక్ట్‌కు ఆద్యుడు దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డేనని, ఆయన హయాంలోనే పోలవరంకు భూసేకరణ పూర్తి చేసి శంకుస్థాపన కూడా చేసారని, 80శాతం కాలువల పనులను కూడా పూర్తి చేసారని కాకాణి పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలే చంద్రబాబుకు గుణపాఠం చెబుతారని ఆయన అన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్, వైకాపా నాయకులు మెట్టు విష్ణువర్ధన్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# 16న కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన శంకుస్థాపన మహోత్సవం ఈనెల 16న జరగనుందని దేవస్థాన పాలకమండలి గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ పేర్కొన్నారు. మంగళవారం బాలాలయ ప్రాంగణంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ 16వ తేదీ ఉదయం 11.18 నుంచి మధ్యాహ్నం 12.18గంటలలోపు బద్వేల్‌కు చెందిన బ్రహ్మశ్రీ కనుమళ్ల సత్యనారాయణ శర్మ శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారని తెలిపారు. ఆర్యవైశ్యుల సహకారంతో సుమారు రూ.10కోట్లతో రాష్ట్రంలోనే అత్యంత సుందరంగా ఈ ఆలయాన్ని నిర్మించనున్నామని వివరించారు. వాసవీ ఇటుకలను బాలాలయం నుంచి ప్రతి ఒక్కరికి ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, వీటిని తమ గృహాల్లో పూజలు చేసి శంకుస్థాపన రోజున దంపతులు సతీసమేతంగా అమ్మవారికి సమర్పించి ఆలయ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుమారు అయిదువేల మంది దంపతులు పాల్గొననున్నారని తెలిపారు. ఆలయ నిర్మాణ కార్యక్రమంలో ఆర్యవైశ్యులందరిని భాగస్వామ్యం చేయాలనే తలంపుతో ఈ నెల 16వ తేదీన అన్ని సంఘాల సమ్మతితో ఉదయం వాణిజ్య సంస్థలను స్వచ్ఛంధంగా మూసివేయనున్నారని తెలిపారు. దేవస్థాన పాలక మండలి అధ్యక్షకార్యదర్శులు దాసా సురేష్‌రాజా, అయితా రామచంద్రరావు, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు సుంకు మనోహర్, సహాయ కార్యదర్శి దొంతంశెట్టి వివేకానందం, సభ్యులు రాము, కోట సూర్యనారాయణ, శ్రీనివాసులు, చలువాది శరణ్‌కుమార్, మింజూరు శ్రీనివాసులు, నున్నా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత గుట్కాల ముఠా

ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు, రాజాఖైనీ, హాన్స్ ప్యాకెట్లు నెల్లూరు వెంకటేశ్వరపురం కేంద్రంగా చుట్టుప్రక్కల గ్రామాలకు సరఫరా అవుతున్నాయి. వెంకటేశ్వరపురానికి చెందిన కొందరు వ్యాపారస్తులు తమ ఇళ్లలోనే వీటిని నిల్వవుంచి విక్రయిస్తున్నారు. చెన్నై నుంచి నేరుగా అట్టపెట్టెల ద్వారా ఈ ప్రాంతానికి తీసుకువస్తున్నారు. కోవూరు, అల్లూరు, రామతీర్థం తదితర ప్రాంతాల్లోని టీ దుకాణాలు, ఫ్యాన్సీ షాపులకు సరఫరా చేస్తున్నారు. ప్రతిరోజూ లక్షల రూపాయల వ్యాపారం జరుగుతోంది. వ్యాపారస్తులు నిబంధనలకు విరుద్ధంగా వీటిని బహిరంగంగానే అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నట్లు సమాచారం. బహిరంగంగా ఈ విక్రయాలు జరుగుతున్నా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉంటున్నారనే విమర్శలు వినవస్తున్నాయి. ఆరోగ్యానికి హాని కల్గించే గుట్కాలు, ఖైనీల విక్రయాలు, సరఫరాను అధికారులు అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



• ప్రగతి యోధునికి సన్మానం

# ధన్యజీవి వెంకయ్య

## మీట్ & గ్రీట్‌లో వక్తల ప్రశంస

భావితరాలకు "వెంకయ్య" జీవితం ఓ ఆదర్శమని, గ్రామ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన ఆయన జన్మ ధన్యమైందని అంటూ జూన్ రెండవతేదీ నెల్లూరు విపిఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన మీట్ & గ్రీట్‌లో పాల్గొన్న ముఖ్యఅతిథులు కేంద్రమంత్రి వెంకయ్యనాయుడిని పొగడ్తలతో ముంచెత్తారు.

వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సి.సుబ్బారెడ్డి, కె.వి.రత్నం, రవీంద్ర సన్నారెడ్డిల ఆధ్వర్యంలో ఏర్పడ్డ ఆతిథ్య కమిటి సారథ్యంలో మీట్ & గ్రీట్ కార్యక్రమం అత్యంత ఆడంబరంగా జరిగింది. ఐక్యరాజ్య సమితి ఆవాస పాలక మండలి అధ్యక్షుడిగా నియమితులైన సందర్భాన్ని పురస్కరించుకుని వెంకయ్యనాయుడికి ఆత్మీయ అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు.

జిల్లాకు చెందిన ఇద్దరు రాష్ట్ర మంత్రులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి, పొంగూరు నారాయణతో పాటు శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, కిలివేటి సంజీవయ్య, పాశం సునీల్‌కుమార్, పోలు బోయిన అనిల్‌కుమార్‌యాదవ్, శాసనమండలి సభ్యుడు బీద రవిచంద్ర, జిల్లా పరిషత్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి, రాజధాని కమిటి సభ్యుడు బీద మస్తాన్‌రావుతో పాటు పలువురు మాజీఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో వేదికపై ఆశీనులయ్యారు.

ఈ సందర్భంగా కార్యక్రమంలో మాట్లాడిన వక్తలందరూ వెంకయ్యనాయుడు తన కార్యదక్షతతో జిల్లా అభివృద్ధి కోసం చేస్తున్న కృషి అభినందనీయమని, ఆయన నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వ సహకారంతో నెల్లూరుజిల్లాను అగ్రగామిగా తీర్చిదిద్దగల దన్న విశ్వాసం తమకుందని ప్రకటించారు.



వెంకయ్యను సత్కరిస్తున్న రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు కె.వేణుగోపాల్, డా॥ కె.కృష్ణకిషోర్

ఆతిథ్య కమిటీ వెంకయ్యను సత్కరించిన అనంతరం దాదాపు నూటికిపైగా వివిధ సంఘాలు, వందలాది మంది ఆయన అభి మానులు ఒక్కొక్కరుగా ఆయనను సత్కరించారు. కార్యక్రమం ఆద్యంతం ఎంతో ఓపికగా వుండి ప్రతిఒక్కరి అభినందనలను వెంకయ్య స్వీకరించాడు.

తనపై ఎంతో అభిమానంతో తనను అభినందించడానికి విచ్చేసిన వారందరికీ తన కృతజ్ఞతలు తెలుపుకుంటూ నెల్లూరు అభివృద్ధి కోసం తనతో పాటుగా అందరూ కలసికట్టుగా ముందుకు రావాలని వెంకయ్యనాయుడు పిలుపునిచ్చాడు. కేవలం తానొక్క డినే అనుకుంటే అభివృద్ధి సాధ్యపడదని, క్షేత్రస్థాయిలో నుండి అందరూ సహకరిస్తే జిల్లాని అగ్రగామిగా తీర్చిదిద్దుకోగలమన్నారు.

పార్టీలకతీతంగా, వర్గాలకతీతంగా జరిగిన ఈ కార్యక్ర మంలో వెంకయ్య కుమార్తె దీపావెంకట్‌తో పాటు అనేకమంది వెంకయ్య అభిమానులూ, ఆప్తులూ, ఆత్మీయులూ పాల్గొన్నారు. 'లాయర్' పత్రిక సారథి తుంగా శివప్రభాత్‌రెడ్డి పర్యవేక్షణలో రత్నం విద్యాసంస్థల డైరెక్టర్ డా॥ కిషోర్ సమన్వయంతో కార్య క్రమం ఆసాంతం ఆనంద భరితంగా సాగింది. ఈ సందర్భంగా వెంకయ్య జీవిత విశేషాలను ఆవిష్కరిస్తూ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ అందరినీ ఆకట్టుకుంది.



# అభినందన



జూన్ 8వ తేదీ గురువారం ఉదయం మాగుంట లే అవుట్‌లోని 'లాయర్' కార్యాలయానికి వచ్చిన "నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి" (నుడా) తొలిచైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని అభినందిస్తున్న 'లాయర్' పత్రిక నిర్వాహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి.

# డిగ్రీలో 'బెగోరె' విద్యార్థుల ప్రతిభ



యాస్మిన్

డిగ్రీ ఫైనలియర్ ఫలితాల్లో నెల్లూరులోని బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు ప్రభంజనం సృష్టించారని కరస్పాండెంట్ జె.వి.రెడ్డి తెలిపారు. బెజవాడ గోపాలరెడ్డి మహిళా డిగ్రీ కళాశాలలో అత్యుత్తమ మార్కులను సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను బుధవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ బిఎస్సీ విభాగంలో యాస్మిన్ 96శాతం మార్కులను సాధిం చిందన్నారు. మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో 50శాతం మంది విద్యార్థులు 100 మార్కులను సాధించారన్నారు. ప్రిన్సిపల్ మృదుల, కంప్యూటర్ అధ్యాపకులు సమతారాణి, పురుషోత్తమ్‌దాస్ పాల్గొన్నారు.






# స్వర్ణభారత్‌లో సేవా స్వరూప్



జూన్ 3వ తేదీ స్వర్ణభారత్ ట్రస్ట్‌లో జరిగిన చెవి, ముక్కు, గొంతు ఉచిత సేవా శిబిరంలో నెల్లూరుకు చెందిన డా॥ నారపరెడ్డి విష్ణుస్వరూప్‌రెడ్డి తమ డాక్టర్ల బృందంతో పాల్గొని రోగులను పరీక్షించి పలు చికిత్సలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డా॥ విష్ణుస్వరూప్ మాట్లాడుతూ హైదరాబాద్‌లోని కేర్ ఆసుపత్రిలో క్షణం తీరిక లేకుండా రోగులకు సేవలందించే తనకూ, తన డాక్టర్ల బృందానికి అప్పుడప్పుడూ ఇలా సేవా కార్యక్రమాల్లో పాల్గొనే సద్భాగ్యాన్ని స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా వెంకయ్యనాయుడు, ఆయన కుమార్తె దీపా వెంకట్ కల్పిస్తున్నారని, స్వర్ణభారత్ వేదికగా నెల్లూరీయులకు తన సేవలు అందించగలగడం తన అదృష్టమని అన్నారు. డా॥ విష్ణుస్వరూప్ బృందానికి 'లాయర్' అభినందనలు.


అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు


# నర్రవాడ వెంగమాంబాదేవి బ్రహ్మోత్సవాలు 11 నుంచి



దుత్తలూరు మండలంలోని నర్రవాడలో వెలసివున్న పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ వెంగమాంబ పేరంటాలు దేవస్థానంలో ఈ నెల 11 నుంచి అమ్మవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగను న్నాయి. ఈ నెల 15వ తేది వరకు జరిగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా 11వ తేది నిలుపు, 12-13 తేదీల్లో గ్రామోత్సవం, 14న ఉదయం పసుపు కుంకుమ ఉత్సవం, కల్యాణోత్సవం, అనంతరం రాత్రికి ప్రదానోత్సవం జరుగుతాయని ఆలయ నిర్వాహకులు తెలియజేశారు. 15న అమ్మవారికి పొంగళ్ళు పెట్టి బండ్లు తిరుగుట తదితర ఉత్సవాలు నిర్వహిస్తామని, భక్తులందరూ ఈ బ్రహ్మోత్సవాలకు విచ్చేసి అమ్మవారిని దర్శించుకుని తరించాలని వారు కోరుతున్నారు.


ది నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లిమిటెడ్
రి.నెం.: 2319
#16/1245, గాంధీనగర్, పొగతోట, నెల్లూరు - 524 001. ఫోన్. 0861 - 2326536.

శతాబ్ది ఉత్సవాలు (1917 - 2017)

తేది : 10-6-2017 ఉదయం 10గంటలకు, ఆర్.ఎల్.రెడ్డి పురమందిరము (టౌన్‌హాల్), నెల్లూరు.

ప్రారంభకులు:
శ్రీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రివర్యులు

విశిష్ట అతిథులు:
శ్రీ సి.హెచ్. ఆదినారాయణరెడ్డి
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సహకార శాఖా మంత్రివర్యులు
శ్రీ కె.రామకృష్ణ
సి.పి.ఐ. రాష్ట్ర కార్యదర్శి, మాజీ శాసనసభ్యులు
శ్రీ డా॥ పి. అనిల్‌కుమార్‌యాదవ్
నెల్లూరు నగర శాసనసభ్యులు
శ్రీ యం. ఆంజనేయులు
మాజీ శాసనసభ్యులు
డైరెక్టరు, సహకార అర్బన్ బ్యాంకులు మరియు క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్య (NAFCUB), న్యూఢిల్లీ.

ముఖ్య అతిథులు:
శ్రీ యం. ఎ. సాల్మన్ కవిరాజు
ఎ.జి.యం. రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా, హైదరాబాద్.
శ్రీ చిట్టూరి రవీంద్ర
మాజీ శాసనసభ్యులు మరియు మాజీ పార్లమెంట్ సభ్యులు
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ సహకరా అర్బన్ & టౌన్ బ్యాంకుల ఫెడరేషన్
మరియు కాకినాడ కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు, కాకినాడ.
శ్రీమతి బి. సుధాభారతి
జిల్లా సహకార అధికారి, నెల్లూరు.
శ్రీ చలసాని రాఘవేంద్రరావు
కార్యదర్శి, ఫెడరేషన్ ఆఫ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్స్ &
క్రెడిట్ సొసైటీస్, ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ
అధ్యక్షులు, విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంకు

ఆత్మీయ అతిథులు
రాష్ట్రంలోని వివిధ అర్బన్ బ్యాంకుల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు

అందరూ ఆహ్వానితులే...
సభాధ్యక్షులు: జె.సి.యస్. అమర్‌నాథ్
అధ్యక్షులు, ది నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి.
పాలకవర్గము - సిబ్బంది

## 'ప్రభా'తం

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. జీఎస్ఎల్వి మార్క్ 3 డీ-1 జీశాట్-19 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి అంతరిక్షంలో భారత కీర్తిని రెపరెపలాడించింది. ఈ విజయం భారత అంతరిక్ష ప్రయోగాల చరిత్రలోనే ఒక అద్భుతం. ఇస్రో చరిత్రలోనే ఇదొక సరికొత్త అధ్యాయం. భారత శాస్త్రవేత్తల నిరంతర కృషికి..వారి దృఢదీక్షకు, అసమాన ప్రతిభకు ఇదొక తిరుగులేని నిదర్శనం. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో పిఎస్ఎల్వి, జిఎస్ఎల్వి రాకెట్లను రూపొందించి రోదసిలోకి విజయవంతంగా పంపిన ఇస్రో.. ఇప్పుడు అత్యధిక బరువు వుండే రాకెట్లను సైతం అవలీలగా అంతరిక్షంలోకి పంపడంలో తన సత్తాను నిరూపించుకుంది. ఇది భారత జాతికంతటికీ గర్వకారణం. ఈ విజయంతో భారత్ కీర్తి ఆకాశమంత ఎత్తుకు ఎదిగింది.

ఇటీవల ఒకేసారి నింగిలోకి 104 ఉపగ్రహాలను విజయవంతంగా పంపి ప్రపంచరికార్డు సాధించిన ఇస్రో..మళ్ళీ కేవలం నాలుగు నెలల్లోపే రోదసిలోకి అత్యంత భారీ ప్రయోగం నిర్వహించి విజయం సాధించింది.. భూ చలన వేగానికి ధీటుగా సంచలించే జియో సింక్రనస్ ఉపగ్రహ ప్రయోగ వాహకనౌక (జిఎస్ఎల్వి) మార్క్ 3-డి 1 జీశాట్ 19 సమాచార ఉపగ్రహాన్ని రోదసిలోకి విజయవంతంగా పంపి భారీ రాకెట్ ప్రయోగాల్లో భారత్ తన సత్తాను చాటుకుంది. శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి ఈ చరిత్రాత్మక ప్రయోగం జరిగింది. ఇంటర్నెట్, టీవీ, టెలికాం రంగాలకు అవసరమైన ఎంతో సాంకేతిక నిపుణతను ఇప్పుడు పంపిన జీశాట్-19 అందజేస్తుంది. అత్యంత క్లిష్టమైన క్రయోజనిక్ సాంకేతిక పరిజ్ఞానంతో ఇస్రో ఈ ప్రయోగం నిర్వహించి ప్రపంచదేశాల దృష్టిని ఆకర్షిస్తోంది.


సుమారు 5,80,600 కిలోల బరువున్న ఈ రాకెట్ రోదసిలో ప్రయాణించి, ఇందులో 3,136 కిలోల బరువున్న సమాచార ఉపగ్రహాన్ని 35,975 కిలోమీటర్ల ఎత్తులో వున్న జిటిఓ (భూ అనువర్తిత బదిలీ కక్ష్య)లోకి తీసుకువెళ్ళగలిగిందంటే మన శాస్త్రవేత్తల ప్రజ్ఞాపాటవాలు ఎంత గొప్పవో తేటతెల్లమవుతుంది. దాదాపు రెండువందల ఏనుగుల బరువుండే రాకెట్‌ను రోదసి లోకి విజయవంతంగా పంపడమంటే మాటలు కాదు. అంతటి అసాధ్యాలను సుసాధ్యం చేస్తున్న ఇస్రోకి అభినందనలు. వాణిజ్యపరంగా కూడా ఇస్రోకి ఈ విజయం మరింత మేలుబాటలు పరుస్తుంది. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో ఇంతటి విజయాన్ని సాధించడం ద్వారా ఇస్రో శాస్త్రవేత్తలు రాకెట్ల ప్రయోగంలో అప్రతిహతంగా ముందుకు సాగుతున్నారు. దాదాపు రెండు దశాబ్దాలపాటు ఎన్నో వ్యయప్రయాసలు, మరెన్నో వైఫల్యాలను సైతం అధిగమించి ఇస్రో దృఢసంకల్ప దీక్షతో, అలుపెరుగని కృషితో విజయపథాన సాగిపోతూవుండడం ఎంతైనా గర్వకారణం. అన్ని వైఫల్యాలను అధిగమిస్తూ రాకెట్ల తయారీలో ఇస్రో తన అపార శక్తిసామర్థ్యాలను ఎప్పటికప్పుడు చాటుకుంటూనే వుంది. స్వదేశీ పరిజ్ఞానంతో సొంతంగా క్రయోజనిక్ ఇంజిన్‌ను తయారుచేసుకుని తాజాగా జిఎస్ఎల్వి మార్క్-3 డి 1ను రోదసిలోకి పంపింది. ఇది తొలి ప్రయోగంలోనే విజయవంతమై అంతరిక్ష పరిజ్ఞానంలో భారత్ అగ్రరాజ్యాల సరసన చేరిందంటే ఇస్రో కృషి-పట్టుదల ఎంత ఘనమైనవో తెలుస్తుంది. కాగా, అంతరిక్ష పరిజ్ఞానంతో దేశంలోని సామాజిక, ఆర్థిక, సాంకేతిక స్థితిగతులను ఎంతో అభివృద్ధి చేసుకోవచ్చు. అందుకే ఇస్రో అందుకు అవసరమైన అన్ని మార్గాలనూ అన్వేషిస్తోంది. ఇంటర్నెట్ వేగాన్ని పెంచేందుకు కూడా కృషి చేస్తోంది. దేశంలో సుమా రు 45 కోట్ల మందికి పైగానే ఇప్పుడు ఇంటర్నెట్ వినియోగించుకుంటున్నారు. అయితే ఇంటర్నెట్ వేగం విషయంలో అనేక దేశాలకన్నా భారత్ ఇంకా వెనుకబడే ఉంది. అందువల్ల ఇంటర్నెట్ వేగాన్ని పెంచే మంచి సామర్థ్యం వున్న మూడు ఉపగ్రహాలను ఇస్రో సిద్ధం చేస్తోంది. అందులో తొలిది జిఎస్ఎల్వి మార్క్-3 ద్వారా ఇప్పుడు పంపిన జీశాట్-19 సమాచార ఉపగ్రహం. ఆ తర్వాత జీశాట్-11, జీశాట్-20 అనే రెండు ఉపగ్రహాలను కూడా ఇస్రో ప్రయోగించనుంది.

ఈ ప్రయోగాలతో కేవలం రెండేళ్ళలోనే సాంకేతికాభివృద్ధి గణనీయంగా పెరిగి, నెట్ వేగం కూడా బాగా పెరుగుతుంది. అంతేకాదు, నాణ్యమైన ఇంటర్నెట్ సేవలతోపాటు, ఫోన్లు, టీవీ, వీడియో సేవలు మరింతగా అందుబాటులోకి వచ్చి హైస్పీడ్ ఇంటర్నెట్ యుగం త్వరలోనే ఆవిష్కృతమవుతుంది. ఒకప్పట్లో రష్యా నుంచి ఉపగ్రహాలను ప్రయోగించిన ఇస్రో ఇప్పుడు స్వయంశక్తితో రష్యా ఉపగ్రహాలను సైతం రోదసిలోకి పంపే స్థాయికి ఎదిగిందంటే అంతరిక్ష రంగంలో ఇస్రో శాస్త్రవేత్తల కృషి-పట్టుదల ఎలాంటివో తెలుస్తుంది. ఇస్రో ప్రయోగిస్తున్న ఉపగ్రహాలు, చేస్తున్న ప్రయోగాలు దేశానికి ఎంతో ఉపయోగకరం. భూమిలోపల, సాగర గర్భంలోను, ఇతర గ్రహాల్లోనూ గ్రహాంతరాల్లోనూ వుండే అమూల్యమైన వనరుల సమాచారాన్ని ఉపగ్రహాలు మనకు అందిస్తున్నాయి. ప్రకృతి విపత్తులను కూడా ముందే తెలుసుకుంటున్నాయి. సమాజాభ్యుదయానికి ఎంతో ఉపకరించే ఈ ఉపగ్రహాల సేవలు జాతికి బహుళప్రయోజనాలను అందిస్తున్నాయి.

ఈ నేపథ్యంలో, జిఎస్ఎల్వి ద్వారా భారత వ్యోమగాముల్ని రోదసిలోకి పంపాలన్న ఆలోచనలు కూడా ఇస్రోకి వున్నాయి. ఆ కల సాకారమైతే, మానవ సహిత అంతరిక్ష ప్రయోగాల్లో రష్యా, అమెరికా, చైనాల తర్వాత భారత్‌కూ స్థానం లభిస్తుంది. భవిష్యత్తులో చందమామ చెంతకు చేరుకోవడం, అంగారక తదితర గ్రహాలపై మరింత విస్తృత ప్రయోగాలు జరపడం వంటి బృహత్తరమైన ఆలోచనల కార్యరూపానికి ఇస్రో ఇప్పటినుంచే సమాయత్తం అయ్యేందుకు...ఈ తాజా ప్రయోగ విజయం ఒక శుభసూచిక అని వేరే చెప్పనక్కరలేదు. విజయపరంపరలతో ముందుకు సాగుతున్న ఇస్రోకు శుభాభినందనలు.

సాహో.. ఇస్రో!.. జయహో ఇస్రో!...

### జయహో..ఇస్రో



భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) మరో అద్భుతాన్ని ఆవిష్కరించింది. జిఎస్ఎల్వి మార్క్ 3 డీ-1 జీశాట్-19 రాకెట్‌ను విజయవంతంగా ప్రయోగించి అంతరిక్షంలో భారత కీర్తిని రెపరెపలాడించింది. ఈ విజయం చరిత్రాత్మకం. భారత అంతరిక్ష ప్రయోగాల చరిత్రలోనే ఒక అద్భుతం. ఇది భారత శాస్త్రవేత్తల కృషికి.. అసమాన ప్రతిభకు తిరుగులేని నిదర్శనం. ఇది భారత జాతికంతటికీ గర్వకారణం. ఈ విజయంతో భారత్ కీర్తి ఆకాశమంత ఎత్తుకు ఎదిగింది. సాహో ఇస్రో!... జయహో ఇస్రో!...

## వెన్నెలకంటి రాఘవయ్య జయంతి

గిరిజన ఐక్యవేదిక, గిరిజన సేవాసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 4వ తేదీ ఆదివారం నెల్లూరులో పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య పంతులు 121వ జయంతి సభ పొట్లూరు శ్రీనివాసులు అధ్యక్షతన జరిగింది. ఈ సభకు ముఖ్యఅతిథులుగా ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి యాకసిరి వెంకటేశ్వర్లు పాల్గొని మాట్లాడుతూ గిరిజన జాతుల కోసం వెన్నెలకంటి విద్య, వైద్యం, అభివృద్ధి విషయాలపై ప్రభుత్వంపై అలుపెరుగని పోరాటం చేసి గిరిజనుల హక్కులను సాధించిన మహనీయుడని కొనియాడారు. పదవ తరగతి, ఇంటర్‌లో అధికశాతం మార్కులు సాధించిన గిరిజన బాలబాలికలను ప్రోత్సహించి వారికి ప్రతిభా పురస్కారాలు అందించాలని కోరారు. గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి, గీత సెల్ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన శ్రీనివాసులుగౌడ్, ఓబిసి రాష్ట్ర కార్యదర్శి వినాయక్‌రావు, గిరిజన మోర్చా రాష్ట్ర ఇసి మెంబర్ వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## పెరుగు కవిత్వంపై శ్రీనివాసులుకు ఎంఫిల్ అవార్డ్



నాలుగు దశాబ్దాలుగా తెలుగు కవిత్వంలో తనదైన ముద్ర కలిగి విలక్షణ కవిగా పేరుపొంది, అంతర్జాతీయ ఖ్యాతి గడించిన సుప్రసిద్ధ కవి డాక్టర్ పెరుగు రామకృష్ణ 2013 మార్చి నెలలో సార్క్ దేశాల సదస్సులో ఆవిష్కరించిన తెలుగు కవిత్వం "ఫూలమ్మిన ఊరు" కవిత్వ గ్రంథంపై మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ద్వారా నెల్లూరుకు చెందిన రామాపురం శ్రీనివాసులుకు ఎంఫిల్ అవార్డును ప్రకటించింది. "ఫూలమ్మిన ఊరు - పరిశీలన" అంశంపై మధురై కామరాజ్ విశ్వవిద్యాలయంలోని ఆచార్యులు డాక్టర్ జె.వెంకటరమణ గైడుగా శ్రీనివాసులు ఈ సిద్ధాంత గ్రంథాన్ని పరిశోధన చేసి సమర్పించారు. ఫూలమ్మిన ఊరు కవిత్వంలోని ప్రపంచీకరణ, గ్రామీకవాదం, మానవతావాదం, జాతీయవాదం, వ్యక్తి ఆరాధన, మనిషితనం కోల్పోతున్న స్వార్థపరత్వం అనే అంశాలపై విశ్లేషణాత్మక వ్యాసాలు పరిశోధనలు ప్రచురించారు. త్వరలో ఈ సిద్ధాంత గ్రంథాన్ని ప్రచురణ చేసి ఆవిష్కరించగలమని పెరుగు రామకృష్ణ ఈ సందర్భంగా పరిశోధకులు శ్రీనివాసులుకు హామీ ఇచ్చారు. ఈమేరకు రామాపురం శ్రీనివాసులుకు పలువురు కవులు, రచయితలు అభినందనలు తెలియజేశారు.

## అభ్యంతరాలుంటే తెలుపుకోవచ్చు

2016-17 సంవత్సరానికి సంబంధించి ప్రత్యేక ఉద్యోగ నియామకం కొరకు దరఖాస్తు చేసుకున్న విభిన్న ప్రతిభావంతుల వివరాలు nellore.ap.nic.in వెబ్‌సైట్‌లో పొందుపరచి వున్నాయని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరు వివరాలపై ఏదైనా అభ్యంతరాలుంటే ఈ నెల 12వ తేదీలోగా నెల్లూరు కొండాయపాలెం వనంతోపులోని కార్యాలయంలో నేరుగా గాని, పోస్టు ద్వారా గాని తెలుపుకోవచ్చని తెలిపారు.




### చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో వైన్‌షాపు తీసేయండి

నెల్లూరు, చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో పార్కుతో పాటు దేవాలయాలు, విద్యాలయాలున్నాయి. విద్యార్థులు, భక్తులు, పార్కుకు వచ్చే సందర్శకులతో ఈ రోడ్డు ఎంతో సందడిగా ఉంటుంది. నగరంలోనే మోడ్రన్ రోడ్డు ఇది. ఈ రోడ్డులో ఒక వైన్‌షాపు పెట్టారు. దీంతో ఈ రోడ్డంతా తాగుబోతుల మయమైంది. అదీ గాక ఈ వైన్‌షాపు హైవేకు దగ్గర్లోనే వుంది. తాగుబోతులు రోడ్డు మీదే తాగి తందనాలాడుతున్నారు. మహిళలు, పిల్లలు, వాహనాలలో వెళ్ళేవాళ్ళు ఈ రోడ్డున పోవాలంటేనే భయపడుతున్నారు. ఈ రోడ్డులో నుండి వైన్‌షాపు తీసేయడానికి జిల్లా కలెక్టర్, ఎస్పీలు చొరవ చూపాలి.

– వాస్తు రామచంద్ర, నెల్లూరు.

### రాహుల్‌కు సిగ్గు లేదా?

ఏపికి ప్రత్యేకహోదా కోసం వైసిపి పోరాడడం లేదని గుంటూరులో రాహుల్‌గాంధీ అన్నాడు. అసలు అక్కడ అనడానికి అతనికి సిగ్గన్నా లేదా? ఏపికి మొదటి ద్రోహి కాంగ్రెస్‌పార్టీ, సోనియాగాంధీ! ఏపిని అన్యాయంగా విభజిస్తున్నప్పుడు ఈ రాహుల్‌గాంధీ నోరు కూడా మెదపలేదు. ఇది అన్యాయమని ఖండించలేదు. అసలు విభజన బిల్లులోనే యూపిఏ వాళ్ళు ప్రత్యేకహోదా అంశాన్ని చేర్చలేదు. అసలు విభజన బిల్లులోనే ప్రత్యేకహోదా అంశాన్ని చేర్చి అమలులోకి తెచ్చివుంటే ఈరోజు ప్రత్యేకహోదా కోసం అడుక్కోవాల్సిన అవసరమేముంది. ఆంధ్రుల చేత కన్నీళ్ళు పెట్టించిన దుర్మార్గురాలు సోనియాగాంధీ! ఆ పాపం పూరికే పోదు. అనుభవిస్తారు. ఈరోజు రాహుల్‌గాంధీ మొసలి కన్నీళ్లు ఆంధ్రులకు అవసరం లేదు.

జి.నాగమునిరెడ్డి, తిరుపతి.

### ఎండల్లో దీక్షలేంటి?

పిచ్చి ముదిరితే తలకు రోకలి చుట్టమన్నారు. అలాగే వుంది చంద్రబాబు వ్యవహారం. రాష్ట్ర విభజన జరిగిన తేదీలలో నవనిర్మాణ దీక్షలు ఎందుకోసం చేస్తున్నట్లు? ఎవరి కోసం చేస్తున్నట్లు? ఈ దీక్షల వల్ల ఉపయోగమేముంది. ఎర్రటి ఎండల్లో జనాన్ని నిలబెట్టి చంపుతున్నారు. పొద్దున పది దాటాక జనం బయటకొచ్చే పరిస్థితులు లేవు. కాని ఉద్యోగులను, విద్యార్థులను దీక్షల పేరుతో ఎండల్లో కూర్చోబెట్టడం శోచనీయం.

ఎస్.డి.ముగ్దూమ్, నెల్లూరు.

## కార్పొరేషన్ వాళ్ళు కూల్చారు...





# కోటంరెడ్డి ఏడ్చాడు!

### 'పెద్దలకొలువు' కూల్చివేతతో పెల్లుబికిన ఆవేదన

సీనియర్ సిటిజన్‌లు, విశ్రాంత ఉద్యోగులు సేద తీరడం కోసం, నలుగురు కలిసి మంచిచెడ్డలు చెప్పుకుంటారనే సదుద్దేశ్యంతో నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తన నియోజకవర్గ పరిధిలో 'పెద్దలకొలువు' పేరుతో వారికి విశ్రాంతి భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే ఇటీవల మొదటి పెద్దల కొలువుకు నెల్లూరు, పొదలకూరురోడ్డులో ఈఎస్ఐ ఆసుపత్రి ముందు కొంచెం స్థలంలో సీనియర్ సిటిజన్స్ చేతుల మీదుగానే శంకుస్థాపన చేయించారు. తన స్వంత నిధులతో దీనికి స్లాబు కూడా వేయించారు. నగర కమిషనర్ నోటి మాట తీసుకునే ఈఎస్ఐ ఆసుపత్రి ముందు దీని నిర్మాణం చేపట్టాడాయన!

అయితే గత నెల 31వ తేదీ నుండి ఈ నెల 3వ తేదీ వరకు నగరంలో అక్రమ కట్టడాల కూల్చివేతలు జరగడం తెలిసిందే! ఈ కూల్చివేతల పరంపరలో ఈ నెల 3వ తేదీన కార్పొరేషన్ సిబ్బంది 'పెద్దలకొలువు' విశ్రాంతి మందిరాన్ని కూడా పూర్తిగా నేలమట్టం చేసేసారు. అడ్డుకోబోయిన వృద్ధులను పోలీసుల సాయంతో నెట్టేసారు. 'పెద్దలకొలువు'ను కుప్పకూల్చారన్న సంగతి ఓ పెళ్లి వేడుకకు హాజరై వున్న కోటంరెడ్డికి తెలిసింది. ఆయన వెంటనే సంఘటనా స్థలికి వచ్చారు. కుప్పకూలిన తన ఆశల సౌధం చూసి ఆయన మనసు ముక్కచెక్కలైంది. హృదయం మూగబోయింది. అక్కడే కూలబడిపోయి భోరున విలపించాడు. దాదాపు గంటసేపు మండుటెండలోనే కూర్చుని నిరసన తెలిపాడు. కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు పరిస్థితి సీరియస్ కావడాన్ని గమనించి అక్కడకు చేరుకున్నాడు. జరిగిన సంఘటన పట్ల విచారం వ్యక్తం చేస్తూ సమన్వయ లోపంతోనే ఇలా జరిగిందని, పెద్దల కొలువుకు తానే మాట పూర్వకంగా అనుమతినిచ్చానని ఒప్పుకున్నారు. అనుమతి లేని భవనం కాబట్టి స్లాబుకు బొక్కలు పొడవమంటే, సిబ్బంది పూర్తిగా కూల్చారని, సమన్వయలోపం వల్లే ఇలా జరిగిందని బాధపడ్డారు.

'పెద్దలకొలువు' కూల్చివేతతో ఈ ప్రాంత ప్రజల్లోనూ తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వంలో, అధికారంలో ఉన్నోళ్ళు చేయలేని పనిని ప్రతిపక్ష ఎమ్మెల్యే చేస్తుంటే, దానిని కూడా అడ్డుకోవడం ఎంత దుర్మార్గమని ప్రశ్నిస్తున్నారు.

కాగా, 4వ తేదీన కూల్చిన స్థలంలోనే తిరిగి 'పెద్దలకొలువు' పునరుద్ధరణకు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి శ్రీకారం చుట్టాడు. ఈసారి ఇక కార్పొరేషన్ వాళ్ళు దానిజోలికి పోకపోవచ్చు. ఎందుకంటే ఒక్కసారికే కోటంరెడ్డి అంటే ఏంటో వాళ్ళు చూశారు.

# శ్రీవారి సన్నిధిలో... సేవకు ఛాన్సుందా?







**తిరుమల తిరుపతి దేవస్థానం పాలక వర్గాన్ని త్వరలో భర్తీ చేసే అవకాశాలున్నాయి. టీటీడీ ఛైర్మెన్ పదవి కోసం రాయపాటి సాంబశివరావు, మురళీ మోహన్‌లు తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే ఎంపీలకు టీటీడీ ఛైర్మెన్ ఇచ్చేది లేదని చంద్రబాబు తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది.**

దీంతో తెరపైకి కొత్త ఆశావహులొచ్చారు. ఇందులో నెల్లూరు జిల్లా నాయకులు కూడా ఉండడం విశేషం. 2014ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి పోటీ చేసి గట్టి పోటీనిచ్చి ఓడిపోయిన మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్మెన్ పదవిని ఆశిస్తున్నాడు. చంద్రబాబు మనసుపెట్టి ఆదేశిస్తే టీటీడీ ఛైర్మెన్‌గా పనిచేసి చరిత్రలో నిలిచిపోవాలని భావిస్తున్నాడు. 2014 ఎన్నికల్లో అన్ని విధాలా నష్టపోయిన ఆయనకు పార్టీ అధికారంలోకి వచ్చాక ఎటువంటి పదవులు ఇవ్వలేదు. పార్టీలో మాత్రం బాధ్యతలు పెంచారు.

రాజధాని కమిటీసభ్యులుగా వున్న బీద మస్తాన్‌రావు బీసీ వర్గాల తరపున టీటీడీ ఛైర్మెన్ పదవిని ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీకి విధేయుడు బిఎంఆర్. పార్టీకి ఆర్థికంగా కూడా అండగా నిలిచాడు. పార్టీని కష్టకాలంలో వీడకుండా నడిచాడు. 2014 ఎన్నికల్లో కావలి నుండి ఓడిపోయిన ఆయన ఆ తర్వాత రాజ్యసభ సీటును ఆశించాడు. అయితే అది నెరవేరలేదు. ఇప్పుడు టీటీడీ ఛైర్మెన్ పదవికి రేస్‌లో వున్నట్లు తెలుస్తోంది. అలాగే నెల్లూరు మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ టి.అనూరాధ పేరు కూడా మహిళా కోటాలో టీటీడీ బోర్డు సభ్యురాలుగా వినిపిస్తోంది. జిల్లాలో ఎవరికి ఛైర్మెన్ పదవి వచ్చినా రాకున్నా వీరిలో ఒకరికి మాత్రం టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యులుగా అవకాశం రావచ్చు.

### సిబిఎస్ఇలో సత్తా చాటిన...
## శ్రీసిటీ చిన్మయా విద్యాలయా



ఈ నెల 3వ తేదీ ప్రకటించిన సిబిఎస్ఇ 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో శ్రీసిటీ చిన్మయా విద్యాలయా విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. పరీక్ష వ్రాసిన మొత్తం 13మంది విద్యార్థులూ ఉత్తీర్ణులు కాగా, వారిలో భైరి ఆకాష్, ఈవని లలిత 10కి 10, సునీత 9.8, కిషోర్ 9.2, గౌతం 9 సిజిపిఏ పాయింట్లు సాధించారు. ఈ పాఠశాల నుండి సిబిఎస్ఇ 10వ తరగతి పరీక్షలు వ్రాయడం ఇదే తొలిసారి. ఉత్తమ ఫలితాలు సాధించినందుకు విద్యార్థులకు, తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు.

### బాలయ్య మాటిచ్చాడు...
# చంద్రబాబు పదవిచ్చాడు

## నుడా ఛైర్మెన్‌గా శీనయ్య



### డైరెక్టర్లుగా ముగ్గురు



నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(నుడా) తొలి ఛైర్మెన్‌గా తెలుగుదేశం నెల్లూరు నగర అధ్యక్షుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఛైర్మెన్‌గా శీనయ్యతో పాటు డైరెక్టర్‌లుగా మరో ముగ్గురిని నియమించారు. కావలి నియోజకవర్గం నుండి బీద మస్తాన్‌రావు అనుచరుడు పొలడుగు రంగారావును, నెల్లూరు నగరానికి చెందిన ఆదాల ప్రభాకర్‌రెడ్డి అనుచరుడు షేక్ ఖాజావలి, సూళ్ళూరుపేట నియోజకవర్గం నుండి బీజేపీకి చెందిన సన్నారెడ్డి దయాకర్‌రెడ్డిలను డైరెక్టర్‌లుగా నియమించారు. అలాగే వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు 'నుడా'లో సభ్యులుగా వ్యవహరించనున్నారు.

సగం నెల్లూరుజిల్లాతో పాటు చిత్తూరుజిల్లాలోనూ రెండు మండలాలలో విస్తరించిన 'నుడా' ఛైర్మెన్ పదవి కోసం జిల్లా తెలుగుదేశం పార్టీ నుండి పలువురు నాయకులు పోటీ పడ్డారు. తమవంతు ప్రయత్నాలు చేశారు. కాని, యువరత్న నందమూరి బాలకృష్ణ మాత్రం తన పట్ల అత్యంత భక్తివిశ్వాసంతో ఉన్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఈ పదవి ఇవ్వాలని చంద్రబాబు వద్ద పంతం పట్టాడు. చంద్రబాబు సొంత నిర్ణయమై వుంటే ఈ పదవి వచ్చేది కాదు. ఆ సంగతి శీనయ్యకు కూడా తెలుసు. బాలకృష్ణ పట్టుబట్టాడు. 2014 ఎన్నికల్లో నెల్లూరు నగరం సీటు శీనయ్యకే అనుకున్నారు. అప్పుడు కూడా బాలకృష్ణ సిఫార్సు చేసాడు. అయితే చంద్రబాబు, బాలయ్యను ఒప్పించి ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డికి సీటిచ్చాడు. కాని 'నుడా' ఛైర్మెన్ విషయంలో మాత్రం బాలకృష్ణ పట్టు వీడలేదు. చంద్రబాబుకు ఇక తప్పలేదు.

కోటంరెడ్డి శీనయ్య రాజకీయ ప్రస్థానం మొదలైంది కాంగ్రెస్‌లో. ఎన్ఎస్‌యుఐ నాయకుడి స్థాయి నుండి కాంగ్రెస్‌లో ఎదిగాడు. కాంగ్రెస్‌లో వున్నంతకాలం కూడా సొంతపార్టీ వాళ్ళతో ఎప్పుడూ పోరాటమే! అటు నేదురుమల్లితోనూ, ఇటు ఆనంతోనూ పడేది కాదు. కాంగ్రెస్‌లో ఆనం ఆధిపత్య పోకడలను నిరసిస్తూ ఆయన 2000 సంవత్సరంలో తెలుగుదేశంలో చేరాడు. అప్పటి నుండి ఇప్పటి దాకా కూడా పార్టీ అధికారంలో వున్నా, ప్రతిపక్షంలో వున్నా పార్టీ కార్యక్రమాలను మాత్రం చురుగ్గా నిర్వహించేవాడు. పార్టీ ప్రతిపక్షంలో వున్న పదేళ్లు కూడా నగరంలో పార్టీ కార్యక్రమాలను అంతా తానే అయ్యి నిర్వహించాడు. పార్టీని నమ్ముకుని పనిచేసినందుకు ఆయనకు తగిన న్యాయమే జరిగింది.

ఇక నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్‌కు సంబంధించిన పోస్ట్ ఇది. కేంద్రంలో పట్టణాభివృద్ధిశాఖ మంత్రి వెంకయ్యనాయుడు గాని, రాష్ట్రంలో పట్టణాభివృద్ధి శాఖ మంత్రి అయిన నారాయణ గాని ఇద్దరూ నెల్లూరోళ్ళే! వాళ్ళిద్దరి సహకారంతో కోటంరెడ్డి శీనయ్య 'నుడా' పరిధిలోని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాల్సివుంది.

36 ఏళ్ళ ప్రస్థానాన్ని సాగించిన లాయర్ వారపత్రికకు మా శుభాభినందనలు.



నెల్లూరు కబుర్లు

# తొలగింపుల తంతు ముగిసిందా?

రచ్చలు, రావిళ్ళు, ఉద్రిక్తతలు, కార్పొరేటర్లు అడ్డుకోవడం, పైనుండి ఒత్తిళ్ళు వంటి సంఘటనల మధ్య నెల్లూరు నగరంలో ఆక్రమణల తొలగింపు తంతును ముగించారు నెల్లూరు నగరపాలకసంస్థ అధికారులు. నెల్లూరులో అక్రమ కట్టడాల తొలగింపుకంటూ బయట మున్సిపాల్టీల నుండి సిబ్బందిని కూడా పిలిపించారు. మున్సిపల్ శాఖ ఆర్.డి ప్రదీప్‌కుమార్, నగరపాలక సంస్థ కమిషనర్ ఢిల్లీరావుల నేతృత్వంలో గత నెల 31 నుండి ఈ నెల 4వతేదీ దాకా అక్రమ కట్టడాల తొలగింపును చేపట్టారు. నగరంలో 55 అక్రమ కట్టడాలు గుర్తించగా, వాటిలో 38 కట్టడాలను ధ్వంసం చేసారు. కొన్ని కట్టడాలకు మాత్రం గడువిచ్చారు. పోలీస్ బందోబస్తు మధ్య అక్రమ కట్టడాల తొలగింపును ఒక పెద్ద యుద్ధం మాదిరిగానే నిర్వహించారు.

# అధునాతన రోడ్ సేఫ్టీ వాహనాలు



అధునాతన వసతులతో నాలుగు రోడ్ సేఫ్టీ వాహనాలను నెల్లూరు ఎస్పీ విశాల్‌గున్నీ ఈ నెల 4వ తేదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగానే అధునాతన సౌకర్యాలతో కూడిన నాలుగు రోడ్‌సేఫ్టీ(హైవే పెట్రోలింగ్) వాహనాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. జిల్లాలో జాతీయ రహదారి వెంబడి రోడ్డు ప్రమాదాల నివారణకు రూ.34లక్షల వ్యయంతో వాటిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. నెల్లూరు పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ స్వయంగా ఆ వాహనాలను నడిపి పనితీరును పరిశీలించారు. జిల్లాలో 177కి.మీల మేర జాతీయ రహదారి ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు నియంత్రించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. అందుబాటులోకి వచ్చిన వాహనాల్లో అధునాతన ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉంటుందని తెలిపారు. క్షతగాత్రులను త్వరితగతిన హాస్పిటల్‌కు తరలించేందుకు, ప్రమాదస్థలానికి పోలీసు సిబ్బందిని చేరవేసేందుకు ఇవి ఉపయుక్తంగా ఉంటాయన్నారు. ఎఎస్పీలు బి.శరత్‌బాబు, వీరభద్రుడు, నెల్లూరు నగర, రూరల్, ఎస్బీ, ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీలు జె.వెంకటరాముడు, కె.తిరుమలేశ్వర్‌రెడ్డి, ఎన్.కోటారెడ్డి, సుధాకర్, ఆర్ఐ శ్రీనివాసరావు, ఎంటిఓ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆనం వెంకురెడ్డి వర్ధంతి



ఈ నెల 5వ తేదీన మాజీమంత్రి ఆనం వెంకటరెడ్డి 22వ వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరు, హరనాథపురం సెంటర్‌లోని ఆయన విగ్రహానికి కుటుంబసభ్యులు, ఆనం అనుచరులు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. 12వ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్ రెడ్డి, రంగనాథస్వామి దేవస్థానం మాజీఛైర్మెన్ పత్తి రవీంద్రబాబు, వై.రంగయ్యానాయుడు, ఆనం అబ్బయ్యరెడ్డి, జి.సుబ్బారెడ్డి, గురవయ్యానాయుడు, ఎం.శ్రీనివాసులు, ముజీర్, రమణ, నిర్మల, గాంధీ, బోస్, సుధాకర్‌రెడ్డి, రమణారెడ్డి, అనూష, షమీమ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# సిబిఎస్ఇలో 'రెయిన్‌బో' విజయకేతనం



సిబిఎస్ఇ పదోతరగతి ఫలితాల్లో రెయిన్‌బో స్కూల్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని కరస్పాండెంట్ పద్మా సుబ్రహ్మణ్యం తెలిపారు. నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని స్కూలులో సిబిఎస్ఇ ఫలితాల్లో ఉత్తమ మార్కులను సాధించిన విద్యార్థులను అభినందించిన అనంతరం ఆమె మాట్లాడుతూ 12మంది విద్యార్థులు 10జిపిఏ, 9.5 జిపిఏను 7మంది, 9జిపిఏను 11మంది, 8జిపిఏపైన 13మంది, 7 జిపిఏపైన ఇద్దరు సాధించారని తెలిపారు.

# ఫ్లెక్సీలపై కమిషనర్ ఫైర్!



ఫ్లెక్సీ... నేటి ఆధునిక కాలంలో పెళ్లైనా, చావైనా, శ్రీమంతమైనా, జయంతులైనా, వర్ధంతులైనా, నాయకుడు వస్తున్నా, నాయకుడు పోతున్నా, ఇంట్లో పురుడైనా, బర్త్‌డే అయినా దానికి సంబంధించిన సమాచారాన్ని తెలిపే ఒక సాధనం. ఈ ఫ్లెక్సీలు వచ్చాకే తలమాసినోళ్లకు కూడా జన్మదిన శుభాకాంక్షలు తెలపడం ఒక ఆనవాయితీ అయిపోయింది. ఫ్లెక్సీలో శుభాకాంక్షలు చెప్పించుకుంటున్న వాడెవడో, చెబుతున్నవాడెవడో కూడా జనానికి తెలియదు. ఫ్లెక్సీలొచ్చాక ప్రతి అడ్డమైన వాడి ముఖచిత్రంతో ఫ్లెక్సీ కటౌట్‌లు వెలుస్తున్నాయి. నగరం నిండా వీటిని అలికిపెడుతున్నారు. అనుమతి లేకుండా నగరంలో ఫ్లెక్సీలు కట్టొద్దని గతంలో కార్పొరేషన్ అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినా ఫలితం కనిపించలేదు. తాజాగా నగరపాలక సంస్థ కమిషనర్ ఢిల్లీరావు కూడా దిక్కుమాలిన ఫ్లెక్సీలపై కన్నెర్రజేశారు. ఈ నెల 5న నగరంలో అడ్డదిడ్డంగా కట్టిన ఫ్లెక్సీలను, బ్యానర్లను తొలగించారు. ఇక నగరంలో ఎక్కడ పడితే అక్కడ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినా, గోడపత్రికలు అంటించినా, అడ్డమైన గోడపత్రికలతో ఐలాండ్‌లను, డివైడర్లను పాడు చేసిపెట్టినా ఊరు కునేది లేదని, గట్టిగానే జరిమానాలుంటాయని ఆయన హెచ్చరిస్తున్నారు. చూద్దాం ఆయన వార్నింగ్‌తో ఏ మాత్రం మార్పు వస్తుందో!

# నగరాభివృద్ధికి ముందుకు రావాలి



నెల్లూరు నగరాన్ని అభివృద్ధి పరచేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ పిలుపునిచ్చారు. సోమవారం నగరపాలక సంస్థ, నేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు విజయమహల్‌గేటు అండర్ బ్రిడ్జి వద్ద గల గోడలకు పెయింట్ వేసే కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు నెలాఖరుకల్లా నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో సుందరీకరణ చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి సరయూ హాస్పిటల్ అధినేత డాక్టర్ రామలింగారెడ్డి, ఇట్టీబిట్టీ స్కూల్ ప్రిన్సిపల్ రాజేంద్రలు ఒక్కొక్కరు రూ.50వేలు వంతున మంత్రికి అందజేశారు. జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, నగరమేయర్ అబ్దుల్ అజీజ్, టిడిపి నగర ఇన్‌ఛార్జ్ ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, విజయ డెయిరీ ఛైర్మెన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, కమిషనర్ ఢిల్లీరావు, నేస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు కోరెం ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇస్తిమాలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్



నెల్లూరు జెండా వీధిలోని పిఎన్ఎం స్కూల్ ప్రాంగణంలో ఆదివారం జరిగిన ఇస్తిమా కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులందరూ అల్లాహ్ చూపిన మార్గంలో పయనించి సుఖసంతోషాలతో జీవించాలన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసదీక్షలు చేస్తున్న ముస్లింలకు అల్లాహ్ దీవెనలు ఎల్లవేళలా ఉండాలన్నారు. మత పెద్దలు మౌలానా అబ్దుల్ ఖదీర్‌రజ్వీ, మౌలానా ముస్తీ ఆలం అష్రఫీ, కార్పొరేటర్లు ఎండి ఖలీల్ అహ్మద్, గోగుల నాగరాజు, మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రూ.33 లక్షలతో జంతువధశాల

నెల్లూరు డైకస్‌రోడ్డులోని జంతు వధశాల అభివృద్ధి పనులను రూ.33 లక్షలతో చేపట్టినట్లు నగర మేయర్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. డైకస్‌రోడ్డులోని మటన్ మార్కెట్ సమీపంలో జంతువధశాల అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని 3వతేదీ ఆవిష్కరించిన అనంతరం మేయర్ మాట్లాడుతూ రూ.1.5కోట్లతో స్థానిక మటన్ మార్కెట్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలను రూపొందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

### ఒలింపిక్ సంఘం అడ్‌హాక్ కమిటి

# ఛైర్మెన్‌గా ఆనం



నెల్లూరుజిల్లా ఒలింపిక్ సంఘంకు అడ్‌హాక్ కమిటీని నియమిస్తూ రాష్ట్ర ఒలింపిక్ సంఘం ఉత్తర్వులు జారీ చేసింది. అడ్‌హాక్ కమిటీ ఛైర్మెన్‌గా మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డిని, ప్రధాన కార్యదర్శిగా ఆర్.కె. పురుషోత్తంను నియమించారు. అలాగే కమిటి కన్వీనర్‌గా తోట మనోహర్‌ను, సభ్యులుగా పసుపులేటి రామ్మూర్తి, ఎం.రవీంద్రబాబు, కె.హరిచంద్రారెడ్డిలను నియమించారు.

# కాస్త ఉపశమనం

### మబ్బులు... ఉరుములు... జల్లులు

ప్రతిరోజూ 45డిగ్రీల ఎండతో మలమలమాడుతున్న నెల్లూరు జనాన్ని మొన్న 5, 6తేదీలలో కొన్ని మబ్బులు, మరికొన్ని ఉరుములు, కాసిన్ని జల్లులు చుట్టం చూపుగా పలుకరించాయి. వాతావరణాన్ని కొంచెం చల్లబరచి ఉపశమనం కలిగించాయి. ఉరుములు, మెరుపులతో పాటు తేలికపాటి వర్షం కురవడంతో నగర వాసుల ఆనందం అంతా ఇంతా కాకుండా పోయింది.

### ఆర్యవైశ్య విద్యార్థులకు

# ఉచిత భోజన వసతి

2017-18 విద్యాసంవత్సరంలో 6వ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు చదువుకునే పేద ఆర్యవైశ్య విద్యార్థులకు నెల్లూరు, పప్పులవీధిలోని శ్రీ పాండురంగ అన్నదాన సమాజం నందు ఉచిత వసతి మరియు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తున్నట్లు సమాజం కార్యదర్శి నీలిశెట్టి వెంకటేశ్వర ప్రసాద్, హాస్టల్ కమిటి ఛైర్మెన్ టి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9వ తేదీ సమాజ మందిరంలో దరఖాస్తు ఫారాలిస్తారు. 18వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుంది. 22వ తేదీ తుది జాబితా ప్రకటిస్తారని, వివరాల కోసం శ్రీ పాండురంగ అన్నదాన సమాజంలో ఉదయం 10గంటల నుండి రాత్రి 8గంటలలోపు సంప్రదించాలని వారు పేర్కొన్నారు.

## కలల సాకారం...
# అభివృద్ధికి శ్రీకారం




కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి యం.వెంకయ్యనాయుడు ఈ నెల 2, 3 తేదీలలో జిల్లాలో పర్యటించారు. అభివృద్ధిపై జిల్లావాసులు కంటున్న కలలను సాకారం చేస్తూ పలు పనులకు శ్రీకారం చుట్టారు. నెల్లూరు కస్తూర్బా కళాక్షేత్రంలో వివిధ పథకాలను ప్రారంభించారు. 2వ తేదీన ఆయన నెల్లూరు పెద్దపోస్టాఫీసులో ఏర్పాటు చేసిన ప్రాంతీయ పాస్‌పోర్టు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. జిల్లావాసులు పాస్‌పోర్ట్ కోసం ఇక తిరుపతికో, చెన్నైకో వెళ్లాల్సిన పని లేకుండా చేసి పుణ్యం కట్టుకున్నారు. అమృత్ పథకంకు శంకుస్థాపన చేసి, అక్కడే జరిగిన నవనిర్మాణదీక్ష సభలో పాల్గొని ప్రసంగించారు. నెల్లూరులో పంట కాలువలపై ఆక్రమణలు తొలిగిస్తే ఊరు చాలా బాగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.



2వ తేదీ వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మూడు వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రాబ్యాంకు ఛైర్మెన్ సురేష్ ఎన్.పటేల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రిడ్జి స్కూల్ నిర్వహణకు 10లక్షల రూపాయల చెక్కును విరాళంగా అందజేశారు. అలాగే స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలోని సెరైడ్ సంస్థలో ఉపాధి రంగాలలో శిక్షణ పొందిన 60మంది యువతీయువకులకు, అలాగే స్వర్ణభారత్, సోమా సాంకేతిక శిక్షణ సంస్థలలో శిక్షణ పొందిన 90మంది యువతీయువకులకు కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు, నీతి అయోగ్ సిఇఓ అమితాబ్‌కాంత్ చేతుల మీదుగా ధృవీకరణ పత్రాలు అందజేశారు.

### స్వర్ణభారత్ వైద్య శిబిరం



అలాగే 3వ తేదీ స్వర్ణభారత్ ట్రస్ట్ ప్రాంగణంలో వెంకయ్య మనుమరాలు ఇమ్మణి సుష్మాచౌదరి పుట్టినరోజును పురస్కరించుకుని ట్రస్ట్ మరియు హైదరాబాద్ కేర్ ఆసుపత్రి ఆధ్వ ర్యంలో ఉచిత ఇఎన్‌టి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కేర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎన్.విష్ణుస్వరూప్‌రెడ్డి, మురళీ, సుధీర్, శ్రీనివాస్, రాజు, రాజశేఖర్ తదితరులు 136మంది రోగులను పరీక్షించి వారిలో వినికిడి సమస్య వున్న 17మందికి కాక్యులర్ ఇంప్లాంటేషన్ శస్త్ర చికిత్సలు చేయాలని నిర్ణయించారు. వీరి చికిత్సలకు అయ్యే ఖర్చును కేంద్రప్రభుత్వం, ఆరోగ్యశ్రీల ద్వారానే కాక తమ కుమార్తె సుష్మ పేరుమీద కూడా భరిస్తామని ఈ సందర్భంగా స్వర్ణభారత్ మేనేజింగ్ ట్రస్టీ ఐ.దీపావెంకట్ తెలియజేయడం గమనార్హం. ఈ సందర్భంగా దివ్యాంగులు, అనాధల మధ్య వెంకయ్య మనుమరాలు, దీపా తనయురాలు సుష్మా కేక్ కట్ చేసి తన జన్మదినోత్సవాన్ని ఆనందోత్సవంగా జరుపుకోవడం విశేషం. దివ్యాంగులు, అనాధలకు యూనిఫారాలు అందజేయడమే కాక వెంకయ్య, ఆయన సతీమణి ఉషమ్మ, కూతురు దీప, కొడుకు హర్షవర్ధన్, మనుమరాలు సుష్మలు వారి మధ్యనే కూర్చుని భోజనం చేసి వారితో ఆత్మీయంగా మెలిగారు.



### చవటపాలెంలో... కోదండరాముడి గుడిలో...

వెంకయ్యనాయుడు తన స్వగ్రామమైన చవటపాలెంకు వెళ్లారు. గ్రామంలోని 260ఏళ్లనాటి శ్రీ కోదండరామస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, ఆలయ గోపుర నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వెంకయ్య తన తల్లి దండ్రులు కీర్తిశేషులు రంగయ్యనాయుడు, రమణమ్మల జ్ఞాపకార్థంగా రాజగోపురం నిర్మిస్తున్నారు. ఈ ఆలయ జీర్ణోద్ధరణకు వెంకయ్య కుమారుడు హర్షవర్ధన్ 24లక్షల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా వెంకయ్య కుటుంబసభ్యులతో కలిసి ఆలయంలో జరిగిన కలశ స్థాపన, ఇతర పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. గ్రామంలో కొంచెంసేపు తిరిగి అందరినీ పేరుపేరునా అభిమానంగా పలుకరించారు.

## విపిఆర్ విద్యార్థులకు...
# ఉచిత పుస్తకాల పంపిణీ



నెల్లూరు, కనుపర్తిపాడు వద్ద విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విపిఆర్ విద్య ఉన్నత పాఠశాలను పేద విద్యార్థులకు ఉచితంగా కార్పొరేట్ విద్యను అందించాలన్న సంకల్పంతో నిర్వహిస్తుండడం తెలిసిన విషయమే! 2016-17 విద్యా సంవత్సరంలో 6 నుండి 8 తరగతులను ప్రారంభించి తరగతికి 30మంది విద్యార్థుల లెక్కన 90మంది నిరుపేద విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తుండడమేకాక వారికి అవసరమైన పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫామ్స్, బూట్లు కూడా ఉచితంగా అందజేశారు. 2017-18 విద్యా సంవత్సరానికి కూడా 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించి 30మంది నిరుపేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రవేశం కల్పించారు. ఈ నెల 4వ తేదీన విపిఆర్ విద్య పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీమతి ప్రశాంతిరెడ్డిలు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు, బూట్లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రభాకర్‌రెడ్డి నాలుగు మంచి మాటలు చెబుతూ చిన్నతనం నుండే క్రమశిక్షణ, నలుగురికి సాయం చేసే సద్గుణాలను అలవరచుకోవాలన్నారు. మన జిల్లా కలెక్టర్‌గా వున్న ముత్యాలరాజు కూడా పేద కుటుంబం నుండే కష్టపడి చదివి కలెక్టర్ అయ్యారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకుని చదువుల్లో రాణించాలని విద్యార్థులకు ఉద్బోధించారు. శ్రీమతి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ఇక్కడ చదివే ప్రతి విద్యార్థి ఉన్నత స్థానాన్ని సాధించినప్పుడే విపిఆర్ ఆశయం నెరవేరుతుందన్నారు. విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ॥ వి.నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసులు, విపిఆర్ విద్య పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మేకిన్ ఇండియా స్ఫూర్తితో ముందుకు

**- నీతిఅయోగ్ సిఇఓ అమితాబ్‌కాంత్**



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపునిచ్చిన మేకిన్ ఇండియా స్ఫూర్తితో పారిశ్రామిక రంగంలో ముందుకు దూసుకుపోవాలని నీతి అయోగ్ సిఇఓ అమితాబ్‌కాంత్ పేర్కొన్నారు. ఈ నెల 2వ తేదీన నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోర్టులో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ ఫెర్టిలైజర్ హ్యాండ్లింగ్ సిస్టమ్‌ను ఆయన ప్రారంభించారు. దక్షిణాసియాలోనే కృష్ణపట్నం పోర్టు ప్రధాన పోర్టుగా ఎదుగుతోందని, ఎగుమతులు, దిగుమతులను అత్యంత సాంకేతిక నైపుణ్యంతో నిర్వహిస్తూ వేగవంతమైన వాణిజ్య ప్రక్రియకు చిరునామాగా నిలిచిందన్నారు. ముఖ్యంగా కృష్ణపట్నంపోర్టు చేపట్టిన కోటి మొక్కల ఉద్యమాన్ని ఆయన అభినందిస్తూ, ఈ ఓడరేవు దేశంలోనే క్లీన్ అండ్ గ్రీన్ పోర్టుగా రూపాంతరం చెందడం అభినందనీయమన్నారు. సివిఆర్ ఫౌండేషన్ ద్వారా జరుగుతున్న సేవా కార్యక్రమాలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో కృష్ణపట్నం పోర్టు కంపెనీ ఎం.డి చింతా శశిధర్, సిఇఓ ఎండ్లూరి అనిల్, సివిఆర్ ఫౌండేషన్ సిఓఓ చక్రవర్తి, పోర్టు పిఆర్ హెడ్ గంటా వేణుగోపాల్, కెఎస్‌ఎస్‌పిఎల్ ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



మాట్లాడుతున్న ట్రస్టుబోర్డు ఛైర్మెన్ కనుమూరు హరిచంద్రారెడ్డి

గూడూరు పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుండి 19వ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టుబోర్డు ఛైర్మెన్ కనుమూరు హరిచంద్రారెడ్డి మాట్లాడుతూ 3వ తేదీ నుండి 13వ తేదీ వరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి విశేష అలంకారాలు, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని భక్తులకు అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేసామన్నారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కె.మునిగిరీష్, ఇవో తాతా శ్రీనివాసరావు, ట్రస్టుబోర్డు సభ్యులు దయాకర్‌రెడ్డి, మునీష్‌జైన్, మాలకొండారెడ్డి, బాలయ్య, ప్రధాన అర్చకులు వాచస్పతి తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 3వ తేదీ రాత్రి అంకురారోహణం చేసి భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ మాజీఛైర్మెన్ శ్రీకంటి రామ్మోహన్‌రావు దంపతులు, నాగరాజారావు దంపతులు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### సిబిఎస్ఇ ఫలితాల్లో...

## లిటిల్ ఏంజల్స్ హవా




ఏఐఎస్ఎస్ఇ 2017 ఫలితాల్లో లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ మరోసారి తనకు ఎవరూ సాటిరారని నిరూపించిందని లిటిల్ ఏంజల్స్ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి 'లాయర్'కు తెలిపారు. ఈ పాఠశాల నుంచి 28వ బ్యాచ్‌గా 93మంది పరీక్షకు హాజరుకాగా 15మంది విద్యార్థులు 10జిపిఏ సాధించడం విద్యార్థుల పట్ల ఈ పాఠశాల చూపే శ్రద్ధకు నిదర్శనమన్నారు. ఈ ఘనవిజయంపై కరస్పాండెంట్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు మాట్లాడుతూ ఈ విజయం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సమిష్టి కృషి అని అన్నారు. ఈ విజయానికి సహకరించిన వారందరికీ అభినందనలు తెలిపారు.




# ఆర్యవైశ్యులకు సంపూర్ణ సహకారం

**- ఎమ్మెల్యే సునీల్**



ఆర్యవైశ్యులకు ప్రతినిత్యం తోడుగా ఉండి సంపూర్ణ సహకారం అందిస్తానని, ఆర్యవైశ్యుల అభివృద్ధికి కృషి చేస్తానని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని డిఎస్ఆర్ కమ్యూనిటీ హాలులో ఆదివారం గూడూరు పట్టణానికి చెందిన ఆర్యవైశ్యుల సంఘం రూరల్ అధ్యక్షుడు కొండా లక్ష్మీనారాయణ (కాశి) ఆధ్వర్యంలో నిర్వహించిన ఏఎంసి వైస్‌ఛైర్మెన్ సోమిశెట్టి చెంచురామయ్య అభినందన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్యవైశ్యులు వ్యాపార పరంగానే కాకుండా రాజకీయ పరంగా ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. సోమిశెట్టి చెంచురామయ్య దీర్ఘకాలికంగా తెలుగుదేశం పార్టీలో మంచి కార్యకర్తగా గుర్తింపు పొందారు కాబట్టి ఏఎంసీ వైస్‌ఛైర్మెన్ పదవి పొందారని అభినందించారు. అనంతరం సోమిశెట్టి చెంచురామయ్య దంపతులను ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు వెంకటసుబ్బయ్య, నాగసూరి గోపాలరావు, తాళంకి రమణయ్య(మానస జ్యూయలరి), బయ్యా మోహన్‌రావు, సోమిశెట్టి రామసుబ్బయ్య, సొల్లేటి ప్రసాద్, శ్రీరాం వెంకటప్రసాద్, సాయి కృష్ణ, జయప్రకాష్, విజయభాస్కర్, నాయకులు శివకుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

# యువత క్రీడల్లో రాణించాలి



క్రీడాకారిణికి బహుమతి అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్, డిఎస్పీ, ఆర్డీవో, రియాజ్ అహ్మద్ తదితరులు

ప్రతి ఒక్కరు కూడా క్రీడలు ఆడడం ద్వారా మానసిక ఉల్లాసంగా ఉంటారని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. గూడూరు పట్టణంలోని ది యంగ్ గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగింపు సభను ఇటీవల అసోసియేషన్ గౌరవ సలహాదారుడు షేక్ రియాజ్ అహ్మద్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న చిన్నారులు అందరూ కూడా క్రీడల్లో మంచి నైపుణ్యం ప్రదర్శించారని, వారు ఇంకా ఎన్నో ఉన్నత శిఖరాలకు ఎదిగి రాష్ట్ర స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధించాలని తెలిపారు. అనంతరం క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో అరుణ్‌బాబు, డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్, కౌన్సిలర్ వాటంబేడు శివకుమార్, కె.మునిగిరీష్, సోమిశెట్టి చెంచురామయ్య, జమాల్, గిరిబాబు, కలాం, కోదండపాణి, ఉదయ్ పాల్గొన్నారు.

### ముగిసిన

## క్యారమ్స్ టోర్నమెంట్

గూడూరు పిఆర్ క్లబ్‌లో రాష్ట్ర, జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి గ్రీన్ క్యారమ్స్ పోటీలు ఇటీవల ముగిసాయి. పురుషుల విభాగంలో కృష్ణా జిల్లాకు చెందిన సుజన్‌కుమార్, మహిళల విభాగంలో హైదరాబాద్‌కు చెందిన సమీర విజేతలుగా నిలిచారు. గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. క్లబ్ కార్యదర్శి ఎల్లసిరి గోపాల్ రెడ్డి, జిల్లా క్యారమ్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, రాష్ట్ర క్యారమ్స్ అసోసియేషన్ ఈసీ సభ్యులు వెంకట్రావు, క్లబ్ కోశాధికారి లక్ష్మీ నారాయణ, ఎస్.రామ్మోహన్‌రావు, నాగరాజారావు పాల్గొన్నారు.

## సాయిబాబా మందిరంలో భరద్వాజ విగ్రహ ప్రతిష్ఠ

గూడూరు పట్టణం, షిరిడిసాయినగర్‌లోని శ్రీ సాయిబాబా మందిరంలో శ్రీ ఎక్కిరాల భరద్వాజ్ విగ్రహాన్ని ఆదివారం నిర్వాహకులు వేడుకగా ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణం ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేకగదిలో వేదవతి సహకారంతో నూతన విగ్రహానికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా చేశారు. ప్రత్యేక పూలంకరణ చేపట్టారు. సాయి భజనలు, పాటలను బృందం సామూహికంగా పాడారు. మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ జనార్ధన్‌రెడ్డి, డాక్టర్ సి.రోహిణి, నాగరాజారావు, పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేకపూజలను చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ప్రతి కొనుగోలుపై బిల్లు తప్పనిసరి



జూలై నెల 1వ తేదీ నుంచి జిఎస్టీ అమలులోకి వస్తుందని, మందుల వ్యాపారులు ప్రతి కొనుగోలుపై బిల్లు తప్పనిసరిగా ఇవ్వాలని ప్రకాశం, నెల్లూరు జిల్లాల సేల్స్ టాక్స్ డిప్యూటి కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి సూచించారు.

సోమవారం నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో వున్న పాండురంగ అన్నదాన సమాజంలో ది నెల్లూరు డిస్ట్రిక్ట్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో జీఎస్టీపై హోల్‌సేల్, రిటైల్ మందుల వ్యాపారులకు అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో పాల్గొన్న డిసి మాట్లాడుతూ జీఎస్టీపై అవగాహన పెంచుకుని, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఇన్‌కంటాక్స్ రిటర్న్, వ్యాపార లావాదేవీలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, రామకృష్ణ, కృష్ణమోహన్, ప్రదీప్ పాల్గొన్నారు.

### పరిశ్రమలశాఖ

## జి.ఎంగా శ్రీనివాసరావు

జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజర్‌గా బి. శ్రీనివాసరావు నియమితులయ్యారు. విజయవాడలోని పరిశ్రమల శాఖ ప్రధాన కార్యాలయంలో డిప్యూటి డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనకు పదోన్నతి కల్పిస్తూ నెల్లూరుకు బదిలీ చేశారు. ఆ మేరకు ఆయన ఈ నెల 3న నెల్లూరులో ఉద్యోగబాధ్యతలు చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు పలు రాయితీలు అందిస్తోందని అన్నారు. పరిశ్రమల అభివృద్ధికి తన సహకారం వుంటుందన్నారు.

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం. దూరం నుండి ఆహ్వానాలు అందుకొంటారు. ఉద్యోగులకు తమ అధికారుల, సహచరుల సహకారం బాగుంటుంది. బిడ్డల విషయంగా శ్రద్ధ అవసరం. అల్లులతో మనస్పర్థలు రావచ్చు. కాబట్టి, అనవసర విషయాలలో జోక్యం చేసి కొనవద్దు. చేసే పనులందు అనుకూలత ఉండినా టెన్షన్ పడుతుంటారు. ఆదాయం పెరుగుతుంది.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఉద్యోగులకు దైనందిన విధి నిర్వహణలో గుర్తింపు గౌరవాలుంటాయి. శుభకార్యాలలో పాల్గొనడం, దూర ప్రయాణాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో కొద్ది ఆటం కాలు తప్ప ఆదాయ లోపం కలుగదు. బంధు ముఖ్యుల అనారోగ్య వార్తలు వినడం, కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం జరుగుతుంది. ఉద్యోగార్థులు ప్రయత్నాలందు జాగ్రత్తగా వ్యవహరించండి.


### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆరోగ్య విషయంలోను ఆహార విషయంలోను జాగ్రత్తలు అవసరం. ఉద్యోగులు పబ్లిక్‌తోను, అధికారుల తోనూ జాగ్రత్తగా మెలగండి. వ్యాపార రంగాల వారికి అధికారుల పరిశీలనలుంటాయి. ఇతరుల వ్యాఖ్యలు మీపై విమర్శనల రూపంలో ఉంటాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. వ్యాపార పారిశ్రామిక రంగాలలో పెట్టు బడులకు అవకాశాలు దొరుకుతాయి.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

గృహ మార్పులు, గృహ వస్తు వాహన రిపేర్లుం టాయి. ఆత్మీయులను, పెద్దలను కలుసుకుంటారు. కాంట్రాక్టులు, ఏజెన్సీలు, లీజులు పొడిగింపబడగలవు. ఉద్యోగ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. పెద్దలు, బంధువుల నుండి శుభవార్తలు వింటారు. ఉద్యోగార్థులకు అవకాశాలకు మరికొంత సమయం పడుతుంది. సమాజంలో పలుకుబడి బాగుంటుంది.

### మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

శుభకార్యాలు నిర్ణయింపబడగలవు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసికొనండి. విలువైన వస్తువులు కొంటారు. పెట్టుబడులు షేర్లు లాభిస్తాయి. అనుకున్న పనులను ఏదో ఒక రీతిలో సాధించుకొంటారు. ఉద్యో గార్థులకు అవకాశాలు దొరుకుతాయి. ముఖ్య పనులకు సలహాలు పొందడం మంచిది. ఆర్థికస్థితి బాగుంటుంది. ఖర్చులు పెరిగినా భారమనిపించవు.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులు నిజబాధ్యతలను సక్రమంగా నిర్వ హిస్తారు. అధికారులకు స్థానమార్పులుంటాయి. సొంత పనులు వ్యవహారాలు అనుకూలం కావడానికి కష్టపడాలి. ఇతరులకు మాట సహాయం చేయడం, గతంలోని విషయాలను గూర్చి ఇతరులచే విమర్శింపబడటం ఉంటుంది. ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. కుటుంబసౌఖ్యం బాగుంది.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

**తేది. 9.6.2017 నుండి**
**తేది. 15.6.2017 వరకు**

ఈ వారం మేషంలో శుక్ర, వృషభంలో రవిబుధులు, మిధునంలో కుజ, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, కుంభంలో కేతువు, వృశ్చిక ధనుర్మకర కుంభరాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**
**ముహూర్తములు**

తేది 10.6.17 సోమవారము ఉదయం గంట 9.0 నుండి 10.20లోగా కర్కాటక లగ్నమున ఉపనయన, వ్యాపార అక్షరాభ్యాస, అన్నప్రాశనలు.

తేది 14.6.17 బుధవారం ఉదయం గంట 9.0 నుండి 10.10 లోగా కర్కాటక లగ్నమున వివాహ, ఉపనయన, అక్షరాభ్యాస, అన్నప్రాశన, కేశ ఖండనములు. రాత్రి గంట 11.45 నుండి 1.20లోగా మీనలగ్నమున వివాహ గృహప్రవేశములు.

**జ్యేష్ఠ మాస కృష్ణపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 9 | శుక్ర | పూర్ణిమ | సా॥ గం.5.29వ॥ |
| తేది. 10 | శని | పాడ్యమి | రా॥ గం.7.28వ॥ |
| తేది. 11 | ఆది | విదియ | రా॥ గం.9.17వ॥ |
| తేది. 12 | సోమ | తదియ | రా॥ గం.10.47వ॥ |
| తేది. 13 | మంగళ | చతుర్థి | రా॥ గం.11.54వ॥ |
| తేది. 14 | బుధ | పంచమి | రా॥ గం.12.30వ॥ |
| తేది. 15 | గురు | షష్ఠి | రా॥ గం.12.36వ॥ |

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

దూర ప్రయాణాలు, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఋణాలివ్వడం, హామీలివ్వడం చేయవద్దు. దీర్ఘకాలిక పెట్టుబడులకు ఉమ్మడి వెంచర్లకు, కొత్త కాంట్రాక్టులకు అనుకూలము. అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. స్థిరాస్తుల లావాదేవీలు పూర్తి చేస్తారు. ఉద్యోగులకు వత్తిడి పనిభారం అధికం. ఉద్యో గార్థులకు ఇంటర్వ్యూ అవకాశాలుంటాయి.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

పెట్టుబడులు షేర్ల యందు సంతృప్తి ఉండదు. శుభకార్యాలలో పాల్గొనడం, బంధుమిత్రులను కలుసు కొనడం జరుగుతుంది. ముఖ్య వ్యవహారాలు కష్టం మీద పూర్తి చేస్తారు. కోర్టు కేసులందు సమస్యలుండ వచ్చును. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు. ప్రభుత్వ ఋణాలు, చేతివృత్తి వారికి అభివృద్ధి కలదు. చేపట్టిన ప్రతి పని సమస్యగా కనిపిస్తుంది.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

విలువైన వస్తువులు, వాహనాలు, గృహోపకరణాలు కొంటారు. అధికారుల వత్తిడి, చికాకులు ఉద్యోగులకుండ గలవు. ఉద్యోగార్థులకు మరి కొద్దికాలం పట్టగలదు. కోర్టు కేసులు, రావలసిన బాకీలు వాయిదా పడతాయి. రాజకీయ వర్గాల వారు ఇబ్బందుల్లో పడతారు. స్థిరాస్తులు, షేర్ల మీద ఆదాయం పెరుగుతుంది. సొంత వృత్తుల వారికి సామాన్యంగా జరిగిపోతుంది.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

కొత్త కాంట్రాక్టులు, వాణిజ్య భాగస్వామిగా అవకా శాలు దొరుకుతాయి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. అవగాహన లేని వ్యవహారాలలో జోక్యం చేసుకొనవద్దు. దైవ కార్యాలలో భాగస్వాములు కాగలరు. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరికే పరిస్థితి ఉన్నది. శుభకార్య ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది.

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ప్రభుత్వ కార్యాలయాలలో పనులు వాయిదా పడ వచ్చును. ఉద్యోగులకు అధికారుల అనుకూలత, బాధ్యతల పెంపు ఉంటుంది. అధికారులకు స్థానమార్పు లుంటాయి. స్థిరాస్తుల షేర్లపై ఆదాయముంటుంది. కోర్టు కేసులందు ఊరట లభిస్తుంది. వాహన రిపేర్లు, శరీరా నికి చిన్న గాయాలు తగలడం ఉంటుంది. ప్రముఖులతో పరిచయాలు, శుభవార్తలు వింటారు.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఆత్మీయులు, కుటుంబీకులతో సంతోషంగా గడుపు తారు. నగదు చెల్లింపులు సంతకాలుంటాయి. కోర్టు కేసులు వాయిదా పడవచ్చును. స్త్రీలకు గుర్తింపు గౌర వాలుండి కార్యనిర్వహణలో ప్రతిభ కనబరుస్తారు. ఉద్యో గులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి. రావలసిన డబ్బు చేతికి అందుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త పడండి. స్థిరాస్తులు, విలువైన వస్తువులను కొంటారు.

# నవ నిర్మాణ దీక్షలో జబర్దస్త్

శ్రీను గల్పిక

అది ప్రపంచంలోని పాతిక మేటి నగరాలను మిక్సీలో వేసి రుబ్బితే వచ్చిన అమరావతి రాజధాని నగరం. హైటెక్‌రత్న, ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం. మంత్రులు దేవినేని ఉమామహేశ్వరరావు, పత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్ర, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, శిద్దా రాఘవరావు, నిమ్మకాయల చినరాజప్ప, పీతల సుజాతలు అప్పుడే ఇంట్లోకి వచ్చారు. అప్పుడే లోకేష్ తన కొడుకు దేవాన్ష్‌ను భుజాల మీద కెత్తుకుని... "చిన్నారి పొన్నారి కిట్టయ్య నిన్నెవరు కొట్టారయ్యా" అనే పాట పాడుకుంటూ హాల్‌లోకి వచ్చాడు. అక్కడ వున్న మంత్రులను చూసి లోకేష్ పాట ఆపేసి, ఏం సార్, అందరూ ఇంత పొద్దున్నే కట్టకట్టుకుని వచ్చారని అడిగాడు. ఈరోజు విజయవాడ బెంజ్‌సర్కిల్‌లో నవనిర్మాణ దీక్ష వుంది కదా ఏర్పాట్ల గురించి మాట్లాడుదామని వచ్చామని ఉమా చెప్పాడు. నాన్నగారు పూజగదిలో దేవుడితో హాట్‌లైన్‌లో మాట్లాడుతున్నారు, పది నిముషాలు వెయిట్ చేయండని చెప్పి లోకేష్ లోపలకు వెళ్లాడు. చంద్రబాబు హాట్‌లైన్‌లో దేవుడుతో మాట్లాడుతున్నాడా? ఢిల్లీతో మాట్లాడుతున్నాడా? అయినా ఈ లోకేష్ మాటలు ఓ పట్టాన అర్థమై చావవు అని అనుకుంటూ మంత్రులు అక్కడే కూర్చున్నారు. కొద్దిసేపటికి చంద్రబాబు అక్కడకు వచ్చాడు. సోమిరెడ్డి వుండి ఆయనతో... మీరు దేవుడుతో మాట్లాడుతున్నారని లోకేష్ అన్నారు, అలాంటి పేరున్న నాయకుడు మన పార్టీలో గాని, ఎన్డీఏలోగాని ఎవరు లేరే, ఎవర్సార్ ఆ దేవుడు అని అడిగాడు. నేను మాట్లాడేది నిజం దేవుడుతోనే... ఆయనే ఏడుకొండలవాడు వెంకటేశ్వరుడు. ప్రతిరోజూ ఆయనతో మాట్లాడాకే నా దినచర్య మొదలవుతుంది. నా పనులన్నీ ఆయనే చెబుతాడు. ఆయన చెప్పినవే నేను చేస్తాను. ఆ దేవుడు శాసిస్తాడు, ఈ చంద్రబాబు ఆచరిస్తాడు. అమరావతిలో రాజధాని కట్టమంది ఆయనే, పోలవరం నిర్మించమంది ఆయనే... అని చంద్రబాబు చెప్పాడు. ఆ మాటకు ఎదురుగా వున్న మంత్రులు ఆశ్చర్యంతో నోర్లు తెరవగా, గోడ మీద పటంలో వేలాడుతున్న వెంకటేశ్వరస్వామి ఆశ్చర్యంతో నామాల మీద వేలేసుకున్నాడు. తర్వాత చంద్రబాబే వుండి.. బెంజ్‌సర్కిల్‌లో నవనిర్మాణదీక్ష ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయని అడిగాడు. అప్పుడు దేవినేని ఉమ... బెంజ్ సర్కిల్‌లో ప్రతిగంటకు కొన్ని వందల బస్సులు, లారీలు, కార్లు వస్తుంటాయి. వాటన్నింటిని ఆపేసి అందులోని వారిని సభలో కూర్చోబెడతాం. అలాగే సినిమా హాల్స్, షాపింగ్ మాల్స్ కొచ్చిన వాళ్లను కూడా ఇక్కడకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నాం. నందిగామ నుండి పది బస్సులు, ఉయ్యూరు నుండి 15బస్సులు పెడుతున్నాం. గన్నవరం నుండి 20బస్సులు, బందరు నుండి పాతిక బస్సులు పెడుతున్నాం. జనం తక్కువైతే నూజివీడు నుండి కూడా 50బస్సులు పెడతామని చెప్పాడు. మీరు బస్సులు ఎన్ని పెట్టారన్నది ముఖ్యంకాదు, జనం ఎంతమంది వచ్చారన్నదే నాకు ముఖ్యం. జనం లేకుంటే మీకు జాతరే అని చంద్రబాబు వార్నింగ్ ఇచ్చాడు.

★★★★★

అది బెంజ్‌సర్కిల్. నవనిర్మాణ దీక్ష సభా ప్రాంగణం. వేలసంఖ్యలో కుర్చీలు వేసారు. పదుల సంఖ్యలో మాత్రమే కుర్చీలు నిండాయి. మంత్రులు దేవినేని ఉమ, పత్తిపాటి పుల్లారావు, కొల్లు రవీంద్రలు టెన్షన్‌తో వున్నారు. అటు వైపు ఒక్క వాహనం కూడా వెళ్లడం లేదు. ఆ సెంటర్‌లో ఒక్క మాల్ కూడా తెరువలేదు. అక్కడ వున్న ఎంపీ కేశినేని నానితో దేవినేని ఉమ... ఏమైంది ఈరోజు, ఇటు వైపు ఒక్క బండి కూడా వెళ్లడం లేదని అడిగాడు. అందుకు నాని... ఈరోజు బెంజ్ సర్కిల్‌లో నవనిర్మాణ దీక్ష అనేసరికి ఈ రూటులో ప్రయాణాలు మానుకున్నారు. అర్జంట్‌గా పోవాల్సినవారు అడ్డదారుల్లో పోతున్నారని చెప్పాడు. అప్పుడే చంద్రబాబు వచ్చాడు. సభకు హాజరైన జనాన్ని చూసాడు. అరికాల్లో మండిందాయనకు. నిన్న బస్సులు, రైళ్లు, విమానాలని లెక్కలు చెబితిరి... ఎక్కడ జనం, ఈరోజు నవనిర్మాణ దీక్ష ఫెయిల్ అవుతుందని దేవుడు చెప్పాడు. అలాగే జరిగింది. కనీసం రేపటి సభకన్నా జనం బాగా వచ్చేటట్లు చూడండని చెప్పి వెళ్లిపోయాడు.

దేవినేని ఉమ, పత్తిపాటి పుల్లారావులు సోమిరెడ్డితో సభలకు జనాన్ని తీసుకురావడం ఓ ఆర్ట్... రేపటి సభకన్నా జనం రాకపోతే మన పరువు పోతుంది. మీరే ఏదో ఒకటి చేయండన్నా అని అడిగారు. వెంటనే సోమిరెడ్డి ఫోన్ తీసి స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకా(66+)కు కాల్ చేసి విషయం చెప్పాడు. అవతల నుండి వివేకా... ఆ సంగతి నాకొదిలేయండి, మీరు తల మీద తడిగుడ్డ వేసుకుని నిద్రపోండని భరోసా ఇచ్చాడు.

★★★★★

రెండోరోజు ఏ1 కన్వెన్షన్ సెంటర్‌లో నవనిర్మాణదీక్ష... హాల్ కిక్కిరిసిపోయింది. లోపల ఎంత జనం ఉన్నారో బయట అంతకు మూడింతల మంది వున్నారు. లోపల సీట్ల కోసం కొట్టుకుంటున్నారు. అక్కడకు వచ్చిన వారిలో మహిళలు, వృద్ధులు, పిల్లలు ఎక్కువుగా వున్నారు. అప్పుడే అక్కడకు వచ్చిన చంద్రబాబు కిక్కిరిసిన జనాన్ని చూసి దేవినేని ఉమ, పత్తిపాటి పుల్లారావులను మెచ్చుకున్నట్లుగా చూసాడు. దాంతో వారిలో ఎనలేని ఉత్సాహం వచ్చింది. అప్పుడే అక్కడకు వచ్చిన సోమిరెడ్డితో వాళ్ళు... వివేకన్న ఏం మాయ చేసాడన్నా, ఇంతమంది జనం వచ్చారని అడిగాడు. దానికి సోమిరెడ్డి... ఏముంది, ఈరోజు నవ నిర్మాణదీక్ష సభలో యాంకర్లు శ్రీముఖి, రవిలచే 'పటాస్' ప్రోగ్రామ్, అనసూయ, రష్మిల ఆధ్వర్యంలో 'జబర్దస్త్' ప్రోగ్రామ్, యాంకర్ సుమ ఆధ్వర్యంలో 'పట్టుకుంటే పట్టు చీర' కాంపిటీషన్స్ జరుగుతాయని ప్రచారం చేయించాడు. అంతేకాదు, వాళ్లను రప్పించాడు కూడా! ఇంకో ఇంపార్టెంట్ విషయం ఏంటంటే ఈరోజు సభలో చంద్రబాబు స్పీచ్ వుండదని ప్రచారం చేశాడు. అందుకే జనం ఇంతగా ఎగబడ్డారని చెప్పడంతో వాళ్లు ఏమైనా మీ నెల్లూరోళ్లు అసాధ్యులన్నా అంటూ నోర్లెళ్ళబెట్టారు.

## కళ్యాణ వైభవం...!



మాజీ ఎమ్మెల్సీ స్వర్గీయ వై.సి.రంగారెడ్డి మనుమడు, ఎర్రంరెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి - శైలజల కుమారుడు **సందీప్‌రెడ్డి - స్వాతీరెడ్డి** (చింతా సుబ్బారెడ్డి - ప్రసూన్నల కుమార్తెల కళ్యాణం ఈ నెల 4వ తేదీ నెల్లూరులోని విపిఆర్ కన్వెన్షన్ సెంటర్ నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాశీస్సులు.

### ప్రతిభకు పదును పెట్టడమే...

# విశ్వసాయి లక్ష్యం



విద్యార్థుల్లో వున్న ప్రతిభకు పదునుపెట్టి, వారిని ఉన్నత స్థానాలు అధిరోహించేలా చేయడమే విశ్వసాయి విద్యాసంస్థల లక్ష్యమని ఆ విద్యాసంస్థల ఛైర్మెన్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ నెల 4వ తేదీన నెల్లూరు, మాగుంట లే అవుట్‌లోని విశ్వసాయి జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ వారినుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన, విలువలు, ప్రమాణాలతో కూడిన చదువులు చెప్పడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. మంచి బోధన, మంచి బోధనా సిబ్బంది, ఆసక్తిగా చదువుకునే వాతావరణం కల్పిస్తూ ప్రతి సంవత్సరం కూడా ఇంజనీరింగ్, మెడికల్, ఇతర కాంపిటీషన్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నామన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడితో కాకుండా స్వేచ్ఛాపూరిత వాతావరణంలో చదువుకునే అవకాశం తమ కళాశాలలో ఉంటుందన్నారు. సమావేశంలో సంస్థ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

### పురిటిబిడ్డకు

# అరుదైన వైద్యం



నెల్లూరు పొగతోటలోని సిద్ధార్ధ చిన్నపిల్లల ఆసుపత్రిలో నెలలు తక్కువతో పుట్టిన పురిటిబిడ్డకు సిద్ధార్ధ చిన్నపిల్లల ఆసుపత్రి వైద్యులు అరుదైన వైద్యం చేసి బతికించారు. ఈమేరకు బుధవారం ఆసుపత్రి అధినేత డాక్టర్ జడ్.శివప్రసాద్, పురిటిబిడ్డల స్పెషలిస్టు డాక్టర్ నాగరాజు మాట్లాడుతూ కడపలో వ్యవసాయ శాఖలో ఏఇగా పని చేస్తున్న ప్రశాంత్, దీప దంపతులకు ఏడో నెలలోనే 800 గ్రాముల అతితక్కువ బరువుతో మగబిడ్డ అక్కడి ఆసుపత్రిలో జన్మించాడు. అతితక్కువ బరువుగలిగి అవయవాలు ఎదుగదల లోపం, శ్వాస తీసుకోవడం కష్టంగా ఉండడంతో అక్కడి నుంచి సిద్ధార్ధ చిన్నపిల్లల ఆసుపత్రికి వైద్యం కోసం తరలించారని తెలిపారు. ఇక్కడ రెండురోజులు వెంటిలేటర్‌పై ఉంచి తర్వాత బిడ్డ బొడ్డు తాడును కట్ చేసి బిడ్డకు ఆహారాన్ని బొడ్డు ప్రేగు ద్వారా అందించామని పేర్కొన్నారు. ఇదే సమయంలో తల్లి మూత్ర పిండాలు విఫలం చెందడంతో ఆమెకు అనేక సమస్యలు వచ్చాయన్నారు. అయినప్పటికి ఎలాగైనా బిడ్డను బతికించాలనే కృత నిశ్చయంతో తాము 51రోజులు వైద్యం చేసామని తెలిపారు. ప్రస్తుతం 1.8కిలోల బరువు పెరిగాడన్నారు. ఊపిరితిత్తులు విచ్చుకునేందుకు క్లిష్టమైన వైద్యం అందించామని తెలిపారు. దీంతో బిడ్డ కోలుకున్నాడని తెలిపారు. ఇలాంటి వైద్యం రాయలసీమ జిల్లాలతో పాటు గుంటూరు, విజయవాడలోనూ ఇదే తొలి కేసు అని వివరించారు.



'నుడా' ఛైర్మెన్‌గా ఎన్నికైన కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఇటీవల ఆయన ఇంట్లో కలిసి సత్కరిస్తున్న పొట్టేపాళెంలోని శ్రీ కోదండరామస్వామి దేవస్థానం ఛైర్మెన్ పొన్నాల రామచంద్రారెడ్డి, ఆ గ్రామ తెలుగుదేశం కార్యకర్తలు, అభిమానులు.

# 10న నెల్లూరు అర్బన్ బ్యాంక్ శతాబ్ది ఉత్సవాలు

నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ శతాబ్ది ఉత్సవాలు ఈ నెల 10వ తేది ఉదయం 10 గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో ఘనంగా జరుగనున్నాయి. 1917లో అర్బన్ బ్యాంక్ ప్రారంభమై ఇప్పటికి నూరు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బ్యాంక్ పాలకవర్గం ఈ శతాబ్ది ఉత్సవాలను పెద్దఎత్తున ఏర్పాటుచేస్తున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఈ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా జరిగే కార్యక్రమంలో విశిష్ట అతిధులుగా రాష్ట్ర సహకారశాఖ మంత్రి సిహెచ్ ఆదినారాయణరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే కె.రామకృష్ణ, నెల్లూరు నగర ఎమ్మెల్యే డా. పి.అనిల్‌కుమార్‌యాదవ్, సహకార అర్బన్ బ్యాంకులు మరియు క్రెడిట్ సొసైటీల జాతీయ సమాఖ్య (ఎన్ఏఎఫ్‌సియుబి) న్యూఢిల్లీ డైరెక్టర్ ఎం.ఆంజనేయులు పాల్గొని ప్రసంగించ నున్నారు. అదేవిధంగా, రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజిఎం (హైదరాబాద్) ఎం.ఏ సాల్మన్ కవిరాజు, రాష్ట్ర సహకార అర్బన్, టౌన్ బ్యాంక్‌ల ఫెడరేషన్ అధ్యక్షులు చిట్టూరి రవీంద్ర, జిల్లా సహకార శాఖ అధికారి బి.సుధాభారతి, ఫెడరేషన్ ఆఫ్ కోఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్స్, క్రెడిట్ సొసైటీస్ కార్యదర్శి చలసాని రాఘవేంద్రరావు ముఖ్యఅతిధులుగా పాల్గొంటారు. నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్‌బ్యాంక్ అధ్యక్షులు జెసిఎస్ అమర్‌నాథ్ అధ్యక్షత వహించే ఈ సభలో రాష్ట్రంలోని వివిధ అర్బన్ బ్యాంకుల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు ఆత్మీయ అతిధులుగా పాల్గొన నున్నారని బ్యాంక్ పాలకవర్గం వారు తెలియజేశారు.










# ప్రభుత్వ కుట్ర భగ్నమైంది

**- పనబాక**



గుంటూరులో ఏఐసిసి ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ సభకు జనం రాకుండా చేయాలనుకున్న ప్రభుత్వ కుట్రను ప్రజలు భగ్నం చేసారని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పనబాక కృష్ణయ్య పేర్కొన్నారు. 5వ తేదీ నెల్లూరులోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు కల్పించినా ప్రజలు స్వచ్ఛంధంగా తరలి వచ్చి రాహుల్ సభను విజయవంతం చేసారన్నారు. ప్రజల ఆకాంక్షకు అద్దంపట్టేలా గుంటూరులో నిర్వహించిన ప్రత్యేకహోదా భరోసా సభ విజయవంతమైందన్నారు. గుంటూరు సభలో 14 జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతలు పాల్గొన్నారు. జాతీయ, వివిధ రాష్ట్రాల నేతలు కూడా విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ఏపికి ప్రత్యేకహోదా ఇవ్వాలని చెప్పారు. కాని మన దరిద్రం ఏంటంటే మన రాష్ట్ర ముఖ్యమంత్రికే ఈ రాష్ట్రానికి ప్రత్యేకహోదా సాధించాలన్న ఆలోచన లేకుండా పోయింది. ఇంతకంటే దుర్మార్గముంటుందా అని ఆయన ప్రశ్నించారు. 15ఏళ్ల పాటు రాష్ట్రానికి ప్రత్యేకహోదానిస్తామని చెప్పి బీజేపీ, టీడీపీ పార్టీలు రెండూ ఏపి ప్రజలను నిలువునా మోసం చేశాయి. రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇవ్వకుంటే వచ్చే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు పుట్టగతులు ఉండవని ఆయన హెచ్చరించారు.

## మహిళలకు చీరల పంపిణీ



కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఆదివారం కావలి 25వ వార్డు వెంగళరావు నగర్‌లో వార్డు కౌన్సిలర్ నెల్లూరు సీతారామమ్మ, వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మహిళలకు చీరలు పంపిణీ చేశారు. పట్టణ ప్రచారకమిటి అధ్యక్షులు నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, విలియం, సుందరయ్య, కోటయ్య, శ్యామ్ మేరి, నిర్మల, నాగేశ్వరమ్మ, బీబిజాన్, కుమారి, నరసమ్మ, కాళెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగునికి ఆర్థికసాయం

నెల్లూరుజిల్లా కావలి తుఫాన్‌నగర్ బీరువాల బజార్‌లో నివాసం ఉంటున్న దివ్యాంగుడు తాళ్ళూరు గోపికి వైద్యఖర్చుల నిమిత్తం ఆదివారం కావలి మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం వద్ద ఉంటున్న పెట్లూరి గోపాలకృష్ణ కిషోర్ తన పుట్టినరోజు సందర్భంగా వెయ్యి రూపాయలు నగదును అందజేసినట్లు కావలి సంయుక్త సేవాసంస్థ అధ్యక్షులు గంగపట్నం సురేంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# అంబరాన్నంటిన అద్భుతం



**అమెరికావాళ్ళు చంద్రుడి మీదకు మనుషులను పంపించారు... రష్యా వాళ్ళు అంగారకుడి మీదకు ఉపగ్రహాన్ని వదిలారు... చైనా అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపింది... ఒకప్పుడు ఈ వార్తలు చదువుతుంటే అంతరిక్షమే కాదు, ఆ దేశాలు కూడా మనకు అందనంత ఎత్తున కనిపించేవి. ఆ దేశాల స్థాయికి మనం చేరగలమా అనిపించేది.**

కాని, ఇంతవరకు నడిచిన చరిత్ర వేరే! ఇప్పుడు నడుస్తున్న చరిత్ర వేరే! అంతరిక్ష ప్రయోగాలలో అగ్రదేశాలకే సవాల్ విసురుతోంది భారతదేశం. ఉపగ్రహాల ప్రయోగాలలో ప్రపంచ దేశాలనే నివ్వెర పోయేలా చేస్తోంది భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో. అమెరికా, రష్యా దేశాల అంతరిక్ష ప్రయోగాల గురించి ఇంతవరకు మనం గొప్పగా చెప్పుకున్నాం. భవిష్యత్‌లో భారత్ అంతరిక్ష ప్రయోగాల గురించి ప్రపంచమే గొప్పగా చెప్పుకుంటుందన్న భరోసాను, నమ్మకాన్ని కలిగిస్తోంది మన ఇస్రో!

అంతరిక్ష ప్రయోగాలలో వైఫల్యం మాటను మరచి, గెలుపును తమ వాకిట్లో కట్టేసుకున్న 'ఇస్రో', మరో అనితర విజయాన్ని సాధించింది. ఈమధ్యనే ఒకే రాకెట్ ద్వారా 104 ఉపగ్రహాలను అవలీలగా కక్ష్యలోకి నెట్టేసి అగ్రదేశాలను ముక్కు మీద వేలేసుకునేలా చేసిన ఇస్రో, ఆ దేశాలు ముక్కు మీద వేసుకున్న వేళ్ళను తిరిగి దించే పని లేకుండా మరో ఘన విజయంతో సత్తా చాటింది.

ఇస్రోకు ఇద్దరు ముద్దుబిడ్డలున్నారు. ఒకరు పిఎస్ఎల్‌వి, ఇంకొకరు జిఎస్ఎల్‌వి. పిఎస్ఎల్‌వి మొదటి నుండి క్రమశిక్షణ గల విద్యార్థిగా చెప్పిన మాట బుద్ధిగా వింటున్నాడు. ఇస్రో చెప్పింది చెప్పినట్లు చేస్తూ వరుస విజయాలతో తన మాతృసంస్థకు కీర్తిప్రతిష్టలు తెస్తున్నాడు.

ఇక రెండోవాడు జిఎస్ఎల్‌వి. కొంచెం మొండోడు. కాకపోతే పిఎస్ఎల్‌వి కంటే బలిష్టుడు. అప్పుడప్పుడు దారి తప్పేవాడు. నింగిలోకి దూసుకుపొమ్మని నిప్పు పెడితే, నీటిలో దూకి తుస్సుమనేవాడు. అయితే మెరుగు పెడితేనే రాయి అయినా వజ్రంగా మారుతుందనే పెద్దలు చెప్పిన సూక్తి మన ఇస్రో శాస్త్రవేత్తలకు తెలియంది కాదు. ఆ సూక్తితోనే ఎన్నో ఏళ్ళుగా శ్రమించారు. జిఎస్ఎల్‌వికి పదును పెట్టారు. లోపాలను కనిపెట్టి సరిచేసారు. సరికొత్త మెరుగులు దిద్దారు. జిఎస్ఎల్‌విని ఇప్పుడొక ఆణిముత్యంగా తీర్చిదిద్దారు. ఇప్పుడు జిఎస్ఎల్‌వి కూడా దారికి వచ్చింది. క్రమశిక్షణతో అప్పగించిన బాధ్యతను సమర్ధవంతంగా నెరవేర్చి తన మీద ఆశలు పెట్టుకున్న ఇస్రో శాస్త్రవేత్తలు, నూటపాతిక కోట్ల భారతీయుల నమ్మకాన్ని అంతరిక్షంలో నిలబెట్టింది.

అంతరిక్ష ప్రయోగాలలో భారత్ మరో ముందడుగు వేసింది. ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5.58గంటలకు నెల్లూరు జిల్లా, శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్ సెంటర్) లోని రెండో ప్రయోగ వేదిక నుండి ప్రయోగించిన భారీ వాహక నౌక జిఎస్ఎల్‌వి మార్క్3-డి1 విజయవంతమైంది. ఈ భారీ రాకెట్ ద్వారా 3136 కిలోల భారీ బరువున్న జీశాట్-19 ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలో ప్రవేశపెట్టారు. ఈ ప్రయోగం విజయవంతం కావడం 'ఇస్రో'కు ఒక శుభ సంకేతం. పూర్తిగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన రాకెట్ ఇది. క్రయోజనిక్ ఇంజన్ సాంకేతికపై ఇస్రో పూర్తి పట్టును సాధించిందనడానికి సంకేతమిది. ఇప్పటి వరకు 2500 కిలోల బరువు దాటిన ఉపగ్రహాలను ప్రయోగించడానికి మనం అగ్రదేశాల మీద ఆధారపడుతూ వచ్చాం. ఇప్పుడు జిఎస్ఎల్‌వి ఇచ్చిన నమ్మకంతో ఇక 5వేల కిలోల బరువుగల ఉపగ్రహాలనైనా ప్రయోగించగలమనే ధైర్యం ఏర్పడింది. అంతేకాదు, భవిష్యత్‌లో ఇస్రో చేపట్టదలచిన అనేక అంతరిక్ష సాహసోపేత ప్రయోగాలకు ఈ ప్రయోగమే అంకురార్పణగా మారింది.

జిఎస్ఎల్‌వి మార్క్3-డి1 ప్రయోగం విజయవంతం కావడంతో దేశమంతా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. భారత రాష్ట్రపతి, ప్రధానిలు ఇస్రో శాస్త్రవేత్తలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రయోగంలో భాగస్వాములైన ఇస్రో ఛైర్మెన్ కిరణ్‌కుమార్, వారి శాస్త్రవేత్తల బృందాన్ని ప్రతి భారతీయుడు అభినందిస్తున్నాడు.



# నవనిర్మాణ శిక్ష

(మొదటి పేజీ తరువాయి)

నవంబర్ 1వ తేదీని వదిలేసి, ఆంధ్రుల గుండెల్లో చిచ్చు రగిల్చిన జూన్ 2వ తేదీ నాడు ఈ సభలేంటి, ఈ జాతరలేంటి? ఇంకా ఆనాటి ఏడుపులేంటి? అసలు నవనిర్మాణదీక్షలంటూ వారంరోజుల పాటు ఈ తిరునాళ్ళేంటి? ఏం చేయడానికి, ఎవరిని ఉద్ధరించడానికి ఇవి చేస్తున్నట్లు? నవనిర్మాణ దీక్షల పేరుతో వారంరోజుల పాటు జరిగిన జాతర రాష్ట్ర వ్యాప్తంగా అధికారుల్లోనే కాదు, ప్రజల్లోనూ, ఆఖరుకు తెలుగుదేశం పార్టీ నాయకుల్లోనూ అసంతృప్తిని రగిల్చింది. ఏదన్నా ఒకరోజు సభ అంటే జనం వస్తారు. అధికారులు వుంటారు. కార్యకర్తలు వింటారు. రోజూ అదే సభ... అదే ప్రసంగాలు... ఊకదంపుడు ఉపన్యాసాలు... ఎంతసేపని వింటారు... ఎన్నిరోజులని వింటారు. ఎవరికి మాత్రం విసుగురాకుండా వుంటుంది.

ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పే సోదితో జనం విసుగెత్తిపోతున్నారు. ఈరోజొక మాట, రేపొక మాట చెప్పడం మా ఇంటా వంటా లేదన్నట్లుగా ఆయన ఈరోజు ఏం చెప్పాడో, మరుసటిరోజూ అదే చెబుతున్నాడు. జనం ఒకరోజు వింటారు, రోజూ వినాలంటే వారికి మాత్రం ఓపిక ఉండొద్దా? తెలంగాణ అభివృద్ధి నా పుణ్యమే, హైదరాబాద్‌ను అభివృద్ధి చేసింది నేనే... హైటెక్ సిటీని కట్టింది నేనే... చంద్రబాబు స్వోత్కర్ష! అరిగిపోయిన రికార్డిది. ఇంకా ఎంతకాలం వేస్తారు. అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్ట్... దేవుడు ఆదేశించాడట... చంద్రబాబు కడుతున్నాడట! ఏం మాటలివి? ప్రజలు కోరుకున్న పనులు చేయరా? ప్రజల సమస్యలు పరిష్కరించరా? దేవుడు ఆదేశించిన పనులు మాత్రమే చేస్తారా? గతంలో ప్రధానులుగా, ముఖ్యమంత్రులుగా పనిచేసినవాళ్లు దేవుడు ఆదేశించినప్పుడు మాత్రమే ప్రాజెక్టులు కట్టారా? ప్రగతి పనులు చేపట్టారా? ప్రజాస్వామ్యంలో ప్రజలకు మించిన దేవుళ్ళు లేరు. వాళ్ళు ఆదేశించడం లేదు, వారి ఆశలకు తగ్గట్లన్నా పని చేస్తేనే మంచి పరిపాలకులనిపించుకుంటారు.

చంద్రబాబు ఈ మూడేళ్ల పాలనలో ప్రచారం జాస్తిగాను, ప్రగతి నాస్తిగానూ ఉండడం తెలిసిందే! ఈ మూడేళ్లలో మనకు ఘనంగా జరిగాయని చెప్పుకునే పనులేంటంటే గోదావరి, కృష్ణ పుష్కరాలు, పట్టిసీమ. ఈ మూడింటి వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదు. మూడేళ్ల నుండి సింగపూర్ లాంటి అమరావతి రాజధాని అంటూ డప్పుకొడుతున్నారు. సింగపూర్ రాజధాని రంగేమిటో మొన్న అమరావతిలో కురిసిన ఒక్క పదును వానతో తేలిపోయింది. సింగపూర్ టెక్నాలజీతో భవనాల నిర్మాణం అంటే భవనాలు పగుళ్లివ్వడం, గదుల్లోకి వర్షపు నీళ్లు కారడమేమోనని జనం అనుకుంటున్నారు.

జరగాల్సిన అభివృద్ధిపై దృష్టి పెట్టడంకంటే కూడా జరగని అభివృద్ధిపై ప్రచారం చేసుకోవడం, సభలు పెట్టి చెప్పుకోవడం చంద్రబాబుకు అలవాటైపోయింది. రాష్ట్ర విభజన తేదీలను కూడా ఆయన వారోత్సవాల మాదిరిగా నిర్వహిస్తున్నాడంటే జనానికి ఇంతకుమించిన హింస ఇంకోటి లేదు.




# సుమధుర స్వరానికి సత్కారం


- మహాగాయనికి గానగంధర్వుని పురస్కారం
- రావు బాలసరస్వతీదేవికి బాలూ వందనం


రావు బాలసరస్వతీదేవికి పాదాభివందనం చేస్తున్న ఎస్పీ బాలు

తొలి తెలుగు సినీ నేపథ్యగాయని..తన మధురాతిమధురమైన కంఠస్వరంతో తెలుగుప్రజలను ఉర్రూతలూగించిన అలనాటి మహాగాయని శ్రీమతి రావు బాలసరస్వతీదేవిని గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమెకు పాదాభివందనం చేసి ఆమె పట్ల.. సంగీతం పట్ల తనకున్న పూజ్యభావాన్ని వెల్లడించుకున్నారు. బాలూ జన్మదినం సందర్భంగా నెల్లూరులోని 'విజేత ఆర్ట్స్' వారి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక టౌన్‌హాలులో జరిగిన కార్యక్రమంలో శ్రీమతి రావు బాలసరస్వతీదేవికి 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జాతీయ పురస్కారం' ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమెకు లక్ష రూపాయల నగదుతో పాటు, జ్ఞాపిక బహుకరించి ఘనంగా సత్కరించారు. ఈ సభలో బాలూ మాట్లాడుతూ, శ్రీమతి రావు బాలసరస్వతీదేవి పాటలు ఆపాతమధురాలని, ఆమె ఏ పాటపాడినా శ్రుతిపక్వంగా..మధురంగా వుంటుందని కొనియాడారు. తొలి తెలుగు సినీ నేపథ్య గాయనిగా ఆమె ఎంతో ప్రఖ్యాతిగాంచారని, ఆ మహాగాయనిని సత్కరించుకోవడమంటే మనల్ని మనమే గౌరవించుకున్నట్లవుతుందన్నారు. తన బాల్యం, బంధాలు -అనుబంధాలు అన్నీ నెల్లూరుతోనే ముడిపడివున్నాయని అంటూ, తన ఊపిరి ఉన్నంతకాలం ప్రతి ఏటా ఈ పురస్కార ప్రదానం వుంటుందన్నారు. గత యాభై ఏళ్లుగా తాను పాడుతున్నానంటే అది మీ అందరి.. ప్రజలందరి ఆశీస్సులేనన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంగీత గేయధార సృష్టికర్త డా. విబి సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ, సంగీతరంగంలో శ్రీమతి రావు బాలసరస్వతీదేవి ఒక కోహినూరు వజ్రమని కొనియాడారు. ప్రఖ్యాత సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అంటే తనకెంతో అభిమానమని, తాను రచించిన పలు పాటలు బాలూ గానం చేసివున్నారని అంటూ, తన మనసులోని భావాలకు తగ్గట్టుగా పాటలు పాడడం బాలూకే సాధ్యమని అన్నారు. 'లాయర్' వారపత్రిక సంపాదకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ, నెల్లూరు గారాల పట్టి.. గానాల పట్టి అయిన బాలూ గారు తన పుట్టినరోజును పురస్కరించుకుని నెల్లూరు కోడలిని సత్కరించుకోవడం సంగీతాభిమానులందరికీ గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా ఆయన ఎస్పీ బాలూకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. మోడరన్ స్కూల్ అధినేత వాకాటి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఎస్పీ బాలు విశ్వవిఖ్యాతమైన గాయకునిగా విశిష్టమైన పేరు ప్రఖ్యాతులు సంపాదించుకోవడం సింహపురిసీమకే గర్వకారణమన్నారు. రాష్ట్ర బ్రాహ్మణసంఘం అధ్యక్షులు వెల్లంచేటి చంద్రమౌళి మాట్లాడుతూ, విఖ్యాత గాయకుడు ఎస్పీ బాలూకు ప్రభుత్వం భారతరత్న బిరుదునిచ్చి గౌరవించాలని కోరారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రముఖ సినీకవి వెన్నెలకంటి మాట్లాడుతూ, ఎస్పీ బాలు జన్మదినం సందర్భంగా కళారంగానికి విశిష్టమైన సేవలందించినవారిని గుర్తించి గౌరవించడమే ఈ పురస్కారం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. అనంతరం తనకు జరిగిన ఘన సత్కారానికి శ్రీమతి రావు బాలసరస్వతీదేవి కృతజ్ఞతలు వెల్లడించారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చేతుల మీదుగా తనకు నెల్లూరులో ఇంతటి ఘనసత్కారం జరగడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బాలూ సతీమణి శ్రీమతి సావిత్రి, బాలూ కుటుంబసభ్యులు ఎస్పీ శైలజ, వసంత, కావలి ఏఎంసి ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, విజేత ఆర్ట్స్ నిర్వాహకులు వై.శేషగిరీశం, డా. ఎం. సుబ్రహ్మణ్యం, వై.విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. తొలుత హేమలక్ష్మి, నాగలక్ష్మి, పద్మాచక్రవర్తులు నిర్వహించిన గాత్రకచ్చేరీ అందరినీ అలరించింది. అనంతరం, ఈ సందర్భంగా నిర్వహించిన పాటలపోటీలో విజేతలకు ఎస్పి బాలూ చేతులమీదుగా బహుమతులు అందజేశారు.



కాంగ్రెస్‌పార్టీ చేయలేనిది...

# టిడిపి చేసి చూపింది

- వ్యవసాయశాఖా మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



పదేళ్ళపాటు అధికారంలో వున్న కాంగ్రెస్ పార్టీ చేయలేనిది టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత 62కోట్లతో ఎత్తిపోతల పథకానికి సిఎం చంద్రబాబునాయుడుతో శంకుస్థాపన చేయించామని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నెల్లూరుజిల్లా పొదలకూరులో జరిగిన నవనిర్మాణదీక్షలో ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నాటికి కండలేరు ఎత్తిపోతల పథకం ద్వారా ఎడమగట్టు కాలువకు సాగునీరు విడుదల చేస్తామన్నారు. మరి కొద్దిరోజుల్లో ఎత్తిపోతల పథకం ద్వారా నీరు విడుదల చేసి ఎండుతున్న నిమ్మ తోటలను కాపాడుతామన్నారు. మనుబోలు మండలంలో కనుపూరు కెనాల్ చివరి ఆయకట్టు 15వేల ఎకరాలకు నీరు అందించాలన్న లక్ష్యంతో 43కోట్లతో దేగపూడి నుండి గొట్లపాళెం వరకు బ్రాంచి కెనాల్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. చేజర్ల మండలం తిరుపతినాయుడుపల్లి వద్ద అసంపూర్తిగా వున్న సోమశిల దక్షిణ కాలువ అక్విడెక్ట్ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. విభజన చట్టం ప్రకారం వెనుకబడిన జిల్లాకు కేంద్రం జిల్లాకు 50కోట్లు ఇస్తుంటే, సర్వేపల్లి నియోజకవర్గంలోని ఒక్క పొదలకూరు మండలానికే తాను 54కోట్లు నీరు-చెట్టు పథకం ద్వారా నిధులు మంజూరు చేయించానన్నారు. అలాగే మండలంలో 56కోట్లతో ఆర్ అండ్ బి రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇంత పెద్దఎత్తున మండలంలో అభివృద్ధి చేస్తుంటే ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి లిటిగేషన్‌లు, పిటిషన్లు పెడుతూ అభివృద్ధి నిరోధకుడిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా మహిళలకు మంత్రి సోమిరెడ్డి, ఎమ్మెల్సీ రవిచంద్రలు దీపం గ్యాస్ కనెక్షన్‌లు పంపిణీ చేశారు.

నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కిలారి వెంకటస్వామినాయుడు, మున్సిపల్ మాజీఛైర్‌పర్సన్ తాళ్ళపాక అనూరాధ, తెలుగు మహిళా నేత నువ్వుల మంజుల, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ హరిత పాల్గొన్నారు.






Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com